జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 204 | హైదరాబాద్, మే 14 శుక్రవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00



## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

హైదరాబాద్,మే 13, ప్రజాపాలన ప్రతినిధి: పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలతో రంజాన్ మాసం శాంతి, ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో గంగా జమునా తహజీబ్‌కు రంజాన్ పర్వదినం ఓ ప్రతీక అన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ముస్లింల జీవితాల్లో వెలుగులు నింపుతూ గుణాత్మక ఫలితాలను ఇస్తున్నాయని సీఎం కేసీఆర్ తెలిపారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఆరేపల్లి రాజేందర్



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):రంజాన్ పవిత్ర పండుగను పురస్కరించుకొని గత నెల రోజులుగా ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ఆరేపల్లి రాజేందర్. భారతదేశం అంటేనే అన్ని మతాల ఐక్యతకు చిహ్నామని,మతమెంత గొప్పదో మానవత్వం అంతకన్నా గొప్పదని ఈ క్లిష్ట పరిస్థితులలో ఒకరికొకరు సహాయం అందించుకోవాలని తద్వారా ఆ దేవుని యొక్క ప్రేమను అందరూ పొందాలని మనసారా కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

# కొత్త నేతలకు అవకాశం ఇస్తేనే మనుగడ



ఇదివరకు కాంగ్రెసు పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశమంటే క్యాబినెట్ కంటే హడావిడి ఉండేది. సీడబ్ల్యూసీలో సభ్యత్వమంటే ముఖ్యమంత్రి హోదాకంటే ఘనతగా భావించేవారు అది గత వైభవం. ఇప్పుడు అసలు వర్కింగ్ కమిటీ సభ్యులెవరో కూడా పార్టీ కార్యకర్తలకే పెద్దగా తెలియదు. గుట్టుచప్పుడు కాకుండా తాజా పరాజయాలపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. షరా మామూలే వరస అపజయాలపై అగ్రనాయకురాలైన సోనియా గాంధీ అసంతృప్తి వెలిబుచ్చారు. పార్టీ నాయకుల నుంచి నివేదిక కోరారు. పార్టీ వ్యవహారాలు ఎంత రొటీన్ గా మారిపోయాయనేందుకు ఇదొక ఉదాహరణ. నివేదికతో మమ అనిపించేస్తారన్న మాట. వర్కింగ్ కమిటీ కార్యాచరణ ఏమిటనేది మాట మాత్రంగానూ ప్రకటించలేదు. రాష్ట్రాల వారీ నాయకత్వ మార్పులకు, నూతన నాయకత్వాన్ని నెలకొల్పుకునేందుకు, మొత్తంగా పార్టీ ప్రక్షాళనకు టువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఏదో తూతూ మంత్రంగా , మొక్కుబడిగా నివేదిక కోరి సరిపెట్టేశారు. గతంలో పరాజయాలపై కూడా ఇదే తరహా నివేదికలను అధిష్ఠానం తెప్పించుకుంది. ఏమేరకు చర్యలు తీసుకున్నారంటే సమాధానం దొరకదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది. 135 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెసు అక్కడక్కడ నామమాత్రంగా మిణుకు మిణుకుమంటోంది. చేసిన తప్పేమిటో పార్టీలోని అగ్రనాయకులకు అంతుపట్టడం లేదు. నిజానికి మన్మోహన్ సింగ్ హయాంలో దేశంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. 2008 లో అంతర్జాతీయంగా ఏర్పడిన సంక్షోభాన్ని సైతం తట్టుకోగలిగింది. అయినా ప్రజలు తిరస్కరించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మన్మోహన్ సింగ్‌లు ఇందుకు కారణం కానేకాదు. చిదంబరం మొదలు అగ్రనాయకులంతా విజృంభించి అక్రమాలకు, అవినీతికి తెరలేత్తేశారు. ఇక మిత్రపక్షాల సంగతి సరేసరి. అవినీతి రాజాలు అడ్డగోలుగా రెచ్చిపోయారు. చర్యలు తీసుకోవడంలో సోనియా ఉదాసీనంగా వ్యవహరించారు. మన్మోహన్ మాట్లాడలేకపోయారు. ప్రతిపక్ష బీజేపీ దానిని సరైన రీతిలో వినియోగించుకుని అధికారంలోకి వచ్చి కూర్చుంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ చాలా కాలం పార్టీ పట్ల నిర్లక్ష్యంగానే వ్యవహరించారు. తీరా ఇప్పుడు కొంత చొరవ చూపుతున్నారు. కానీ ఇప్పటికే ఆలస్యమైపోయింది. నిజమైన ప్రజాస్వామ్యం నిలవాలంటే బలమైన ప్రతిపక్షం ఉండాలి. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారి, ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నా బీజేపీ పలు రాష్ట్రాల్లో నెగ్గుకొస్తోంది. ప్రత్యామ్నాయంగా కాంగ్రెసు విఫలమవుతోంది. తాజాగా సాగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో గెలిచేందుకు బలమున్నా చేజార్చుకుంది. పుదుచ్చేరిలో నిన్నామొన్నటి వరకూ అధికారంలో ఉంది. సంప్రదాయకంగా కేరళలో ఈసారి కాంగ్రెసు నేతృత్వంలోని యూడీఎఫ్ గెలవాలి. అలాగే అసోంలో బలమైన కూటమి కట్టడం ద్వారా గెలిచేందుకు అవకాశముందని అంచనా వేశారు. అన్ని చోట్లా ఫెయిల్ అయ్యింది . పైపెచ్చు పెద్ద రాష్ట్రమైన పశ్చిమబెంగాల్ లో ప్రతిపక్ష స్థానం నుంచి ఊడ్చి పెట్టుకుపోయింది. తమిళనాట డీఎంకేకు తోకగా కొనసాగడమే తప్ప సొంత బలం కాదది. భావి వారసులు అయిన రాహుల్ , ప్రియాంకలు ఈ దఫా ఎన్నికల్లో గట్టిగానే పనిచేశారు. గెలుపు అవకాశాలున్న కేరళ, అసోంల బాధ్యతలను ఇద్దరూ పంచుకున్నారు. ఆ రెండు రాష్ట్రాల పైన బీజేపీ అగ్రనాయకత్వం పెద్దగా దృష్టి పెట్టలేదు. అసోం బీజేపీ గెలుపునకు స్థానిక నాయకత్వమే కారణం. కేరళ లో పెద్ద స్కోరు రాదని బీజేపీకి తెలుసు . అందుకే దానిని కూడా వదిలేసింది. కమలం అగ్రనాయకులందరూ పశ్చిమ బెంగాల్ పైనే ఫోకస్ పెట్టారు. ఇది కాంగ్రెసు పార్టీకి మంచి చాన్సు . అయినా కేరళ, అసోం లలో సానుకూల ఫలితాలు తెచ్చుకోలేకపోయింది. ఓడిపోయిన ప్రతిసారీ నివేదికలు తెప్పించుకుంటే సరిపోదు. గతంలో వచ్చిన నివేదికలపై చర్యలు తీసుకుని ఉంటే పార్టీ శ్రేణులు, నాయకులు క్రమశిక్షణతో ఉంటారు. అందులోనూ జనరేషన్ ఛేంజ్ పార్టీలో కనిపించడం లేదు. బీజేపీలో ఇప్పటికే రెండో తరం నాయకత్వం రాష్ట్రాల్లో వచ్చేసింది. యడియూరప్ప వంటి ఒకరిద్దరు తప్ప మొత్తంగా రాష్ట్రాల నాయకత్వంలో మార్పు కనిపిస్తోంది. జాతీయ స్థాయిలోనూ పెద్దలందర్నీ పక్కన పెట్టేశారు. రాజ్ నాథ్ సింగ్ వంటి వారు లాంఛనంగా మిగిలిపోయారు. కాంగ్రెసు మాత్రం ఈ తరహా ప్రయోగాలు చేయలేకపోతోంది. పాత తరం పెద్దలు పార్టీ పదవులను పట్టుకుని వేలాడుతున్నారు. రాష్ట్రాల్లో యువతకు అవకాశం ఇవ్వడం లేదు. ఒకవేళ బీజేపీ తప్పుల కారణంగా ఆ పార్టీ ఓడిపోయి, కాంగ్రెసు అధికారంలోకి వస్తే మళ్లీ పదవులు తామే అనుభవించాలని వృద్ధ నాయకులు కలలు కంటున్నారు. ఫలితంగా కాంగ్రెసు ఎప్పటికీ అధికారంలోకి రాలేని వాతావరణాన్ని కల్పిస్తున్నారు. ఈ నాయకుల అక్రమాలు, అవినీతి ప్రజలకు తెలుసు. కాబట్టి వీరికంటే బీజేపీయే నయమనుకుంటున్నారు. నిజంగానే పార్టీ బాగుపడాలి. సరిదిద్దుకోవాలనుకుంటే రాష్ట్రాల నాయకత్వ ప్రక్షాళన జరగాలి. దానికి నివేదికలు అవసరం లేదు. ప్రజలిస్తున్న తీర్పులు సరిపోతాయి.



## పీఎం మిస్సింగ్ : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,మే 13, ప్రజాపాలన ప్రతినిధి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కనిపించడం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. కోవిడ్–19 మహమ్మారి నేపథ్యంలో వ్యాక్సిన్లు, ఆక్సిజన్, మందులతో సహా ప్రధాని మోదీ కనిపించకుండాపోయారని, మనకు మిగిలినవి సెంట్రల్ విస్టా ప్రాజెక్టు, మోదీ ఫొటోలేనని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ప్రతి రోజూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ కోవిడ్–19 మహమ్మారిని ఎదుర్కొంటున్న తీరుపై రాహుల్ తీవ్ర ఆగ్రహం ప్రకటిస్తున్నారు. కోవిడ్ రోగులు ఆక్సిజన్, మందులు అందుబాటులో లేకపోవడంతో నానా కష్టాలు పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారు. దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ చేసేందుకు వ్యాక్సిన్లు కూడా అందుబాటులో లేవని, కోవిడ్ రెండో ప్రభంజనంతో కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాహుల్ గాంధీ గురువారం ఇచ్చిన ట్వీట్‌లో, “వ్యాక్సిన్లు, ఆక్సిజన్, మందులతో సహా ప్రధాన మంత్రి కూడా కనిపించడం లేదు. ఇక మిగిలినవి సెంట్రల్ విస్టా ప్రాజెక్టు, మందులపై జీఎస్‌టీ, అక్కడా ఇక్కడా ప్రధాన మంత్రి ఫొటోలు మాత్రమే” అని పేర్కొన్నారు.

## తెలంగాణలోనే వ్యాక్సిన్ తయారీ... మనకే దొరకదా? రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 13, ప్రజాపాలన ప్రతినిధి: రెండో విడత కరోనాను ఎదుర్కోవడంలో తెలంగాణ సర్కార్ ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కరోనా వ్యాక్సిన్‌ను కేవలం రెండు కంపెనీలే తయారు చేస్తున్నాయని, మిగతా కంపెనీలకు కేంద్ర అనుమతే లేదని, అలాంటి సమయంలో గ్లోబల్ టెండర్లను ఎందుకు పిలుస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరిని మభ్య పెట్టడం కోసం ఆ టెండర్లను పిలుస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి గురువారం పాత్రికేయులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం కరోనా కేసులను తగ్గించి చూపడం వల్లే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వ్యాక్సిన్లు, మెడిసిన్లు తక్కువగా పంపుతోందని ఆరోపించారు. (మిగతా 2లో...)

## తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు తర్వాతే..




న్యూఢిల్లీ,మే 13, ప్రజాపాలన ప్రతినిధి, : తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఇప్పట్లో ఉండవు అని, కరోనా ఉధృతి తగ్గిన తర్వాతే ఉంటాయని సీఈసీ తేల్చిచెప్పింది. పరిస్థితులు మెరుగుపడినా తర్వాతే ఎన్నికల నిర్వహణకు ఆలోచిస్తామని పేర్కొంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఖాళీలపై ఇటీవలే ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఆ లేఖపై చర్చించిన సీఈసీ ఇప్పట్లో ఎన్నికలు ఉండవు అని తమ నిర్ణయాన్ని తెలిపింది.త్వరలో ఏడుగురు ఎమ్మెల్సీల పదవీ కాలం ముగుస్తోంది. ఇందులో ఆరుగురి పదవీ కాలం వచ్చే నెల జూన్ 3న పూర్తవుతోంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవీ కాలం జూన్ 16న ముగియనుంది. వచ్చే నెలలో గడువు ముగుస్తున్న ఎమ్మెల్సీల్లో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్, కడియం శ్రీహరి,

(మిగతా 2లో...)




## పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)

అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)
(A Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004
https://ambedkarrajaneethi.com E-mail : ambedkarrajaneethimovement@gmail.com



**ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి**

బహుజన మిత్రులారా !
జై భీమ్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.

అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటున్నాం. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాకులు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, పూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ అంబేడ్కర్‌గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించు కుంటూ చేయి చేయి కలిపి సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలిగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే సాధించుకొవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

**సమసమాజ స్థాపనకు పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) ఆశయాల పట్ల అవగహన కల్పించడానికి రండి కదలి రండి.**

1. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు భారత రాజ్యంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ మీరెంతో మీకంత (మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్) అని ప్రతిపాదిస్తుంది.
2. మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.
3. ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లీ మెట్లు ఎక్కలేదు. కాబట్ట 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లీకి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.
4. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేద వాడిని ఇంకా పేదవాడుగా.... గుడిసెలను ఇంకా పూరిగుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక వర్గం పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.

ఈ ప్రతిపాదలను అంగీకరించే ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా www.ambedkarrajaneethi.com వెబ్సైట్ ద్వారా పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) లో సభ్యులుగా చేరి సమాజంలోని అందరికి అవగాహన కల్పించి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించుకునేందుకు రండి.. కదలి రండి...

**రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.**
**ఈ కమిటీలలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.**
**అ కమిటీలలో కనీసం ఏడు కులాలనుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిథ్యం కలిగివుంటుంది**
**అసక్తి ఉన్నవారు సంప్రదించగలరు**

**ఆంధ్రప్రదేశ్**
డా॥ ప్రత్యూష సుబ్బారావు కన్వీనర్, 9030644440
డా॥ పి. పరమ శివన్, 9440077239
యం. కమలాకర్ రావు, 9393921011
సొంటి నాగరాజు, 9959488555
హనుమంత్‌రావు

**తెలంగాణ**
అరెపల్లి రాజేందర్, స్టేట్ వర్కింగ్ కన్వీనర్, 9440918371
ఉప్పు సత్యనారాయణ,8688300704
మల్లెల రామనాథం, 9346939481
డి. గోవర్ధన్, 9963300551

Central Working Committee Members :
జె.బి. రాజు బహుజన IIS-vrs
నిశాంత్ బహుజన
డా॥ గూడూరు సీతామహాలక్ష్మీ 8008840506
దూలపల్లి వాణి
గుంజి నరసింహా రావు 7995914086

నేషనల్ కన్వీనర్ డా॥ కె. శివభాగ్యారావు బహుజన IRS-vrs

జై భీమ్... జై పూలే... జై భారత్

## మిల్లర్ల నుండి రైతులను కాపాడండి వరిదాన్యం రైతుల నిరసన సెగ



జగిత్యాల, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల రూరల్ మండల్ లక్ష్మీపూర్ గ్రామంలో రైతులు రోడ్డుపై బైటాయించి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. లక్ష్మీపూర్ ఐకేపీ సెంటర్ నుండి వెళ్ళే వరిధాన్యం ఐకేపీ సెంటర్ వాళ్ళు ఇచ్చిన మిషన్ లో తప్ప తాలి లేకుండ (పట్టిన) వడ్లను వ్యవసాయ అధికారులు ధ్రువీకరించిన కూడ మిల్లర్లూ మీధాన్యంలో తప్పా తాలి ఉన్నదని మీధాన్యం మేము కొనమని మేము కోనాలంటే క్వింటాలుకు ఒక కేజీ తరుగు తీసేస్తామని లేదంటే తిరిగి పంపిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని రైతులు వాపోయారు. గిట్టుబాటు ధర లేక మిల్లర్ల దోపిడీ మాటలిని రైతులు పూర్తిగా నష్టపోతున్నారని మిల్లర్ల నుండి రైతులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ నక్క విజయ్ కుమార్ బాధిత రైతులు నాతర్ల శ్రీనివాస్ శేఖర్ వెంకటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### లాక్ డౌన్ ఏర్పాట్లను పరిశీలించిన సి పి సత్యనారాయణ



బెల్లంపల్లి మే 13 ప్రజా పాలన ప్రతినిధి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో లాక్ డౌన్ ఏర్పాట్లను రామగుండం సి పి సత్యనారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెల్లంపల్లి పట్టణం లోని వివిధ ప్రాంతాల్లో లాక్ డౌన్ ఏర్పాట్లను ఆకస్మికంగా పరిశీలించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా తిరుగుతే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచిర్యాల పెద్దపల్లి జిల్లా లోని అన్ని ప్రాంతాల్లో లాక్ డౌన్ నిబంధనలను పటిష్టంగా అమలు జరుపుతున్నామని పేర్కొన్నారు. రాత్రిళ్లు తిరుగుతూ లాక్ డౌన్ నిబంధనలను అతిక్రమించినందుకు పలువురికి జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఉదయ్ కుమార్ రెడ్డి, ఎస్ ఐ లు సిఐ లు ఏ సి పి లు, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత



బెల్లంపల్లి, మే 13 , ప్రజా పాలన ప్రతినిధి: మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం కన్నెపల్లి పోలీస్టేషన్ పరిధిలోని సుర్జాపూర్, కన్నెపల్లి గ్రామల్లో బెల్ట్ షాపుల్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని గురువారం రామగుండం టాస్క్ ఫోర్స్ సి ఐ రాజ్ కుమార్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కన్నె పెల్లి మరియు సుర్జాపూర్ గ్రామంలో అక్రమంగా దాచిపెట్టి అమ్ముతున్న మద్యాన్ని ముందస్తు పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. దాడి చేసి 25 వేల రూపాయల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నిందితులు ఆయిల్ల వెంకటేష్ సుర్జాపూర్, జిల్లెల ప్రకాష్ గౌడ్ కన్నెపల్లి లను పట్టుకున్న మద్యంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్లో విచారణ నిమిత్తం అప్పగించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో రామగుండం టాస్క్ ఫోర్స్ సిబ్బంది శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాకేష్, ఓంకార్, పాల్గొన్నారు.

### ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ పండుగ శుభాకాంక్షలు:జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత



జగిత్యాల, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల జిల్లా ముస్లిం సోదర సోదరీమణులకు పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా జగిత్యాల జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేశ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు ఉపవాసాలుండి పవిత్ర రంజాన్ మాసాన్ని పూర్తిచేసుకుని నేడు రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరి సోదరీమణులు లాక్డౌన్ కోవిడ్ నిబంధనాలు పాటించి ఇండ్లలోనే భక్తిశ్రద్ధలతో కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని వసంత ఆకాంక్షించారు. కరోనా వైరస్ కట్టడి నేపథ్యంలో కొనసాగుతున్న లాక్డౌన్ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ తీసుకుంటున్న జాగ్రత్తలకు ప్రతి ఒక్కరు సహకరించి కరోనా వైరస్ కట్టడికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వసంత కోరారు.

## కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా రంజాన్ పండగ నిర్వహించుకోండి

**రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**



పటాన్ చేరు, మే 13, ప్రజాపాలన ప్రతినిధి:ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ పర్వదినం పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదర సోదరీమణులకు పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా దృక్పథాన్నీ, మత సామరస్యాన్ని చాటిచెప్పే రంజాన్ పర్వదినాన్ని సంతోష కరమైన వాతావరణంలో కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన విధంగా సామూహికంగా ప్రార్థనలు నిర్వహించకుండా తమ తమ ఇళ్లలోనే ప్రార్థనలు నిర్వహించుకోవాలని కోరారు.

## శంకర్ ఘాట్ (మోతె)హిందూ స్మశాన వాటికను ప్రారంభించిన ఎమ్మెల్యే సంజాయ్ కుమార్



జగిత్యాల, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల పట్టణంలోని కోటి 25 లక్షలతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన టియూఎఫ్ఐడిసి నుండి 80 లక్షలు 14 ఆర్థిక సంఘము నుండి 45 లక్షల నిధులతో ఆధునికరించిన మోతే హిందూస్మశాన వాటిక శంకర్ ఘాట్ ను మునిసిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణితో కలిసి ఎమ్మెల్యే డా. సంజాయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో ప్రధానంగా మూడు స్మశానవాటికలు మోతే చింతకుంట గొల్లపల్లి రోడ్ లో ఉన్నాయని పట్టణ వాసులు ప్రధానంగా వినియోగించే ఈ స్మశానవాటికలను కోట్లాది రూపాయల నిధులతో ఆధునికీకరణ సౌకర్యాలతో అన్ని స్మశానవాటికల్లో 80 శాతానికి పైగా పూర్తి అయినయని అన్నారు. కోవిడ్ ప్రత్యేక పరిస్థితుల కారణంగా మోతె స్మశాన వాటికను ఆధునికరించిన ఈ స్మశాన వాటికలో పూజగది ఇల్లులేని వారు ఉండేందుకు మూడు గదులు వంటగది భోజనషెడ్డు ఆస్తికలు భద్రపరిచే గది స్త్రీలు పురుషులు స్నానాలకు ప్రత్యేక గదులు కార్యాలయం మార్చురీ అన్ని సౌకర్యాలతో పునర్నిర్మాణం చేయడం జరిగిందని పేర్కొన్నారు. భోగ శ్రావణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పట్టణంలో వైకుంఠదామలు నిర్మించడం అధిక జనాభా కలిగిన కిరాయిదారులు పేదప్రజల ఇబ్బందులు తమకు తెలుసని ఎమ్మెల్యే కుమార్ చొరవతో అందుబాటులోకి తేవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ డీఈ లచ్చిరెడ్డి గట్టు సతీష్ కౌన్సిలర్లు గుగ్గిళ్ల హరీష్ క్యాదాసు నవీన్ అరుముళ్ల పవన్ బోగ ప్రవీణ్ వొళ్ళెం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## కరోనాను జయించినవారు ప్లాస్మా దానం చేయండి

**మీకు తోడుగా వేముంటాం-కముటం వెంకటరమణ**



కరీంనగర్, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి): ప్రస్తుత కరోన పరిస్థితులలో రోజు వందలాది మందిని ఈ మహమ్మారి మింగేస్తుంది ఎన్నో కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి విలవిలలాడుతున్నాయి. కుటుంబాలకు అలాంటి పరిస్థితి రాకూడదు అంటే కరోనాను జయించిన నువ్వు ముందుకు రావాలి నీవే మాకు దిక్కు అని ఎదురుచూస్తున్న కుటుంబాలు మరెన్నో ఉన్నాయి వాళ్లకి తోడుగా నువ్వుండు నీకు తోడుగా మేము ఉంటాము ప్లాస్మా దానంతో ఇద్దరి ప్రాణాలను నిలబెట్టు మహమ్మారిని తరిమికొట్టు అని ఎస్. ఆర్. ఆర్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ కముటం వెంకటరమణ అన్నారు. ప్లాస్మా దానం చేయండి ప్రాణ దాతలుగా మారండి అని విజ్ఞప్తి చేశారు 9440889682.

## కరోనా వైరస్ పై కాలనీ వాసులకు అవగాహన



బాలపూర్, మే 13, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా మహమ్మారి వైరస్ విలయతాండవం చేస్తున్న సందర్భంలో 5వ డివిజన్ కాలనీవాసులకు మనోధైర్యంతో పాటు, బ్లీచింగ్ పౌడర్ కానీ, శానిటైజర్ తో కానీ పిచికారి చేసిన వారు లేరాని కాలనీవాసులు వాపోతున్నారు. కంటెస్టెంట్ కార్పొరేటర్ దగ్గరకొచ్చి మొరపెట్టుకుంటే ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏం చేస్తున్నారు, స్థానిక కార్పొరేటర్ పట్టించుకుంటలేరా......? అదేవిధంగా నిరుపేద కుటుంబాలకు కరోనా పాజిటివ్ వారికి చేదోడు వాదోడుగా ఉంటూ స్థానిక కార్పొరేటర్ మనోధైర్యం కలిగించాలని, కాలనీల్లో హైడ్రోక్లోరిక్ ద్రావణంతో పిచికారి చేయించాలని, డివిజన్లో అసలు ఏం జరుగుతుందో కూడా పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. కాలనీ వాసులకు భరోసా కలిగిస్తూ కరోనా ను కట్టడి చేయడానికి అవగాహన కలిగేటట్లు కాలనీవాసుల తరపున కంటెస్టెంట్ కార్పొరేటర్ కోరారు.

### ఏడో డివిజన్ లో రంజాన్ కిట్ల పంపిణీ




బాలపూర్, మే 13, ప్రజాపాలన ప్రతినిధి: రంజాన్ పవిత్ర పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ కిట్ ను సిద్ధాల చిన్న బీరప్ప అందజేశారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఏడో డివిజన్ స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు గురువారంనాడు రంజాన్ కిట్ల ను పంపిణీ. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రంజాన్ పండుగ పవిత్రమైన పర్వదినం ప్రతి ఒక్కరు సురక్షితంగా ఆనందంగా గడిపే రోజుల్లో ఇప్పుడు ఈ కరోనా మహమ్మారి పరిస్థితిలో జాగ్రత్త పాటు భౌతిక దూరము అదే విధంగా ప్రార్ధనాలయం లో కాకుండా ఇంట్లో జరుపుకోవాలని కోరుకుంటూ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలలో సాటిలేని సీఎంగా, మన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారంగా నిరుపేద ముస్లిం సోదరి కుటుంబాలకు అందించడంలో ముందుగా ఉంటూ స్థానిక కార్పొరేటర్ సిద్ధాల చిన్న బీరప్ప రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

### రేకులపల్లి గ్రామంలో హైపోక్లోరైడ్ స్ప్రే...



బీరుపూర్, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి): బీరుపూర్ మండల్ రేకులపల్లె గ్రామంలో గురువారం రోజున సర్పంచ్ ఎలగందుల లక్ష్మిఅశోక్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా కరోన ఉధృధి నేపథ్యంలో గ్రామంలోని ప్రతి వాడలో హైపోక్లోరైడ్ బ్లీచింగ్ పౌడర్ శానిటేషన్ స్ప్రే చేయించారు. కరోనా సోకిన వారి కుటుంబాలకు మనో ధైర్యాన్ని చెప్పుతూ ప్రతి ఒక్కరు మస్కులు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసారపు రమేష్ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి ఆరే రాణి కారోబర్ మ్యాడ గంగరెడ్డి గ్రామ పంచాయతీ సిబ్బంది గంగయ్య నర్సయ్య మల్లేష్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### కరోనాతో ప్రతాఫ్ రావు మృతి పలువురు సంతాపం...



బీరుపూర్, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి): బీరుపూర్ మండలం తుంగూర్ గ్రామా మాజీ సర్పంచ్ మాజీ పాక్స్ చైర్మన్ ధన్నపనేని ప్రతాఫ్ రావు కరోనాతో పోరాడి గురువారం ఉదయం మృతి చెందారు. ప్రతాఫ్ రావు మరణం పట్ల స్థానిక ఎమ్మెల్యే డా. సంజాయ్ కుమార్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు. స్థానిక సర్పంచ్ గుడిసె శ్రీమతి ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి ప్రజా ప్రతినిధులు ముప్పాల రాంచందర్ రావు ముక్క శంకర్ ఎంపీపీ మసర్తి రమేష్ గుడిసె జితేందర్ యాదవ్ కోలుముల రమణ పాత రమేష్ ముక్క వెంకటేష్ ఆడెపు తిరుపతి గంగారాజం దోసరపు బుచ్చన్న తదితరులు ఆయన మృతి ఎంతో భాద కల్గించిందని వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ప్రతి గ్రామంలోని రైతు వేదికలను క్యారంటైన్ గా మార్చాలి

**"లాక్ డౌన్"లో పేద ప్రజలను ఆదుకోవాలి**

**ఎంఎస్పి జిల్లా కోఆర్డినేటర్ రేగుంట మహేష్**



ఆసిఫాబాద్ జిల్లా మే13(ప్రజా పాలన, ప్రతినిధి): ప్రతి గ్రామంలోని రైతు వేదికలను క్యారం టైన్ గా మార్చి, లాక్ డౌన్ సమయంలో పేద ప్రజలను ఆదుకోవాలని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎం ఎస్పి) జిల్లా కోఆర్డినేటర్ రేగుంట మహేష్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేష్ మాట్లాడుతూ దేశంలో "కరోనా వైరస్" సెకండ్ వేవ్ చాలా తీవ్రంగా వ్యాపిస్తుందని, కరోనా ను అరికట్టే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, విఫలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాక్సిన్ విషయములో చాలా అలస్యంగా వ్యవహరిస్తున్నారని, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు వ్యాక్సిన్ ఉచితంగా అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరోనా ను ఆరోగ్య శ్రీ లో చేర్చి, ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించాలని కోరారు. కరోనా విజృంభిస్తున్న ప్రాంతాలలో ప్రత్యేకంగా అధికారులు దృష్టి పెట్టి, ప్రజల ప్రాణాలు కాపాడుకునే దిశగా ఆక్సిజన్ తో కూడిన ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టినటువంటి "లాక్ డౌన్" విషయంలో చాలా మంది పేద ప్రజలు ఉపాధి లేక, తినడానికి తిండి లేక, చాలా అవస్థలు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఉచితంగా ప్రతి కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, ప్రతి కుటుంబానికి నెలకు రూ10 వేల చొప్పున వారి అకౌంట్లో జమ చేయాలని కోరారు.

## బొల్లారంలో ఆరోగ్య సర్వే



సంగారెడ్డి, మే 13, ప్రజాపాలన ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆరోగ్య సర్వే కొనసాగుతోంది లాక్ డౌన్ నిబంధనలు పాటిస్తూ ఉదయమే మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ అధికారులు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరోనా లక్షణాలు ఉన్నవారికి మెడికల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

## తెలంగాణలోనే వ్యాక్సిన్ తయారీ... మనకే దొరకదా? రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

కరోనా వ్యాక్సిన్ తెలంగాణలోనే తయారవుతోందని, తెలంగాణ అవసరం తీరిన తర్వాతే బయట రాష్ట్రాలకు ఇస్తామని కేసీఆర్ ఎందుకు చెప్పడం లేదని సూటిగా ప్రశ్నించారు. ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాలు వారి అవసరాలు తీరిన తర్వాతే ఇతర రాష్ట్రాలకు ఆక్సిజన్‌ను పంపిస్తున్నారని గుర్తు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులన్నీ కేసీఆర్ బంధువులవేనని, అందుకే కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చడం లేదని ఆరోపించారు. కేసీఆర్ సలహాలను విని ప్రధాని మోదీ మెచ్చుకున్నారని ప్రభుత్వం తెలిపిందని, ఇంకా నయం... ఢిల్లీకి పిలిపించి సన్మానం చేస్తారని కేసీఆర్ చెప్పుకోలేదని ఎద్దేవా చేశారు.

**సాంకేతికతను ఇతర కంపెనీలకు ఇవ్వాలి...**

వ్యాక్సిన్ తయారీ చేస్తున్న రెండు కంపెనీల సాంకేతిక నైపుణ్యాన్ని ఇతర కంపెనీలకు ఇప్పించాలని, అప్పుడే అందరికీ వ్యాక్సిన్ అన్న కల నెరవేరుతుందని రేవంత్ సూచించారు. వ్యాక్సిన్ అంశాన్ని కూడా వ్యాపారాత్మక ధోరణిలో ఆలోచించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా మందులు, వ్యాక్సిన్‌పై కూడా జీఎస్టీ వసూలు చేయడం దారుణమని, కరోనా వైద్యానికి ఉపయోగించే అన్నింటిపై జీఎస్టీని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**కేటీఆర్, జయేశ్ రంజన్‌పై ఫైర్**

మందులు, వ్యాక్సిన్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీ వేసిందని, మంత్రి కేటీఆర్, ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో అధికారి రాజశేఖర్ రెడ్డి సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. కేటీఆర్, జయేశ్ రంజన్ అన్నింటిలో భాగస్వాములని, కరోనా ఎదుర్కోవడంలో ఈ అధికారులు ఎవరైనా పనిచేశారా? అని ఎద్దేవా చేశారు. కొనుగోళ్లు అనగానే కేటీఆర్ వచ్చారని, కేటాయింపులు జరిగేవి వచ్చాయంటే కేటీఆర్, హరీశ్‌లు వస్తారని చురకలంటించారు. దోపిడీకి కారణం అయిన ఏ శాఖ అయినా కేసీఆర్ కుటుంబం దగ్గరే ఉంటుందని, ఈటలను తొలగించడానికి కారణం కూడా అదేనని రేవంత్ ఆరోపించారు.

## తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలు తర్వాతే..

(మొదటి పేజీ తరువాయి)

ఫరీదుద్దీన్, ఆకుల లలిత, బోడకుంటి వెంకరేశ్వర్లు ఉన్నారు. ఇక, గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న మరో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి. కాగా, గవర్నర్ కోటాను భర్తీ చేసేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయంతో ఈ ఖాళీ భర్తీ చేయాల్సి ఉంటుంది.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఆనంద్ కృష్ణారెడ్డి



బొల్లారం, మే 13, ప్రజాపాలన ప్రతినిధి: బొల్లారం మున్సిపాలిటీలోని నివాసముంటున్న పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి కరోనా సోకి బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కె జే ఆర్ ట్రస్ట్ ఫౌండర్ ఆనంద్ కృష్ణారెడ్డి మానవత్వాన్ని చాటుతూ స్పందించి అతడి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల కోసం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అతడి భార్య కు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో పేద ప్రజలకు తన వంతు బాధ్యతగా ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని ఆనంద్ కృష్ణారెడ్డి తెలిపారు.

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : ప్రపంచవ్యాప్తంగా నర్సుల సేవలు ఎంతో అవసరమని, నర్సుల వృత్తి ఎంతో పవిత్రమైనదని తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి పి.హెచ్.సి దగ్గర గల పద్మ రెసిడెన్సీ సెల్లార్ నందు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ.దయానంద్ యాదవ్ సౌజన్యంతో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ రోగులకు ( పేషంట్స్ ) వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవ కూడా అంతే ముఖ్యమని అన్నారు. మందులు లేని కరోనా వైరస్ పై ఆయుధం లేకుండా పోరాటం సాగిస్తున్న వారు నర్సులు అని ఆయన అన్నారు. అందుకే నర్సులు అందరికీ శిరస్సు వంచి ఈ సమాజమంతా ప్రణమిల్లుతుందని ఆయనఅన్నారు. నర్సుల సేవలు అనిర్వచనీయం, అభినందనీయం ఆయన పేర్కొన్నారు. ఈ కరోనా బాధితులకు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారు అందిస్తున్న తీరు నర్సుల పట్ల విపరీతమైన గౌరవాన్ని పెంపొందిస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పి.హెచ్.సి శేరిలింగంపల్లి, ఏరియా హాస్పిటల్ కొండాపూర్, ఏరియా, నిమ్స్, అర్బన్ హెల్త్ సెంటర్ హాఫీజ్ పేట, బి.హెచ్.ఈ.ఎల్ , తదితర ప్రభుత్వ హాస్పిటల్ కి చెందిన నర్సులకు జ్ఞాపిక, శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రామ్మోహనరావు , వెంకటేశ్వరరావు , నాగేశ్వరరావు , నరేష్ , ఖాదర్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో సంపూర్ణంగా లాక్ డౌన్

## మంత్రి హారీష్ రావు ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్న పోలీసులు రోజు పట్టణం మొత్తం తిరుగుతూ పర్యవేక్షిస్తున్న సి పి జోయల్ డేవిస్



సిద్దిపేట, మే 13, ప్రజాపాలన ప్రతినిధి:సిద్ధిపేట పట్టణంలో లాక్ డౌన్ ఈ రెండు రోజులు సంపూర్ణంగా జరిగింది. మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు పోలిసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం తో ప్రజలు అత్యవసరం ఐతే తప్ప బయటకు రావడం లేదు. పట్టణంలో పలు కూడళ్లలో చెక్ పోస్టు లు ఏర్పాటు చేయడంతో ప్రజలు అనవసరంగా బయటకు రావడం చాలా వరకు తగ్గించారు. ఐతే లాక్ డౌన్ లేని ఉదయం 6 గంటల నుండి పది గంటల వరకు ముఖ్యంగా 8 తరువాత పట్టణంలో కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ జామ్ లు అవుతున్న పరిస్థితి





కనిపిస్తుంది . సిద్ధిపేట గాంధీ విగ్రహం నుండి లాల్ కమాన్ వెళ్లే దారి ఇరుకుగా ఉండడంతో లాక్ డౌన్ మొదటిరోజు ఎక్కువగా ట్రాఫిక్ జామ్ పరిస్థితులు తలెత్తాయి. ఆ దారిలో హెవీ వెహికిల్స్ ని రాకుండా నియంత్రించాలని ప్రజలు కోరుకుంటున్నారు. సిద్ధిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ జోయల్ డేవిస్ రోజు పట్టణం మొత్తం తిరుగుతూ లాక్ డౌన్ సంపూర్ణంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ట్రీట్మెంట్ పొందుతున్న కరోనా బాధితుల కుటుంబ సభ్యుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి .కరోనా ఉందన్న అనుమానంతో పరీక్షల కోసం ప్రయివేట్ డయాగ్నస్టిక్ సెంటర్ ల వద్ద కూడా జనం ఎక్కువగా ఉండడం పట్టణంలో కరోనా ఉధృతిని తెలియజేస్తుంది.ఏదేమైనా ఈ రెండు రోజులు లాక్ డౌన్ సంపూర్ణంగా జరగడంలో పోలీసుల కృషి అభినందనీయం.

# కోవిడ్ వైద్యానికి అధికంగా ఫీజు వసూలు చేయకుండా పేషంట్లకు పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాటు చేయాలని బిజెపీ వినతి



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : బీజేపీ రాష్ట్ర పార్టీ సూచన మేరకు శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని పలు ప్రైవేట్ హాస్పిటల్ లో ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ లోనే కోవిడ్ ట్రీట్మెంట్ కు సంబంధించిన కోవిడ్ వైద్యానికి అధికంగా ఫీజు వసూలు చేయకుండా కోవిడ్ పేషంట్లకు పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత మాదినగూడ ప్రాణమ్ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యానికి డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేంద్ర ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఇవాళ కోవిడ్ వ్యాధి ఒక పెను తుఫాన్ లా,సునామిలా జన జీవితాలను అల్లకల్లోలం చేస్తోందని అన్నారు. ఈ సమాజానికి మానవతా దృక్పథంతో కూడిన మీ కృషి ఎంతో అవసరం అని అన్నారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించి వైద్యులు మానవరూపంలో ఉన్న దేవుళ్ళు అనే ఆర్యోకితిని మీ చేతల ద్వారా నిరూపించుకోవాల్సిన సంక్లిష్ట సమయం ఇది అని అన్నారు.ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటురంగ పరిశ్రమలు, కార్పొరేట్ అధినేతలు,పౌర సంస్థలతో కలసి కోవిడ్ బాధితుల ప్రాణాలు కాపాడడానికి చేస్తున్న కృషికీ మీ సహాయ సహకారాలు అత్యంత ఆవశ్యకం అని అన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఫీజులు వసూలు చేయాలి అని కరోనా బాధితుల అవసరాల్ని ఆసరాగా తీసుకొని ఇష్టారీతిగా వ్యవహరించవద్దు అని అన్నారు. కరోనా వల్ల అసలే మానసిక ఆందోళనలో ఉన్న రోగిని వారి బంధువులను ఫీజుల పేరిట మరింత భయభ్రాంతులకు గురిచేయవద్దు అని అన్నారు. అలాగే ప్రతి ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం కేటాయించిన ఫీజులోనే చికిత్స చెయ్యాలని బీజేపీ తరపున కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రవి గౌడ్, వర ప్రసాద్, కోటేశ్వరరావు, లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో 71 మందికి కరోనా పాజిటివ్

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండల పరిదిలోని వలిగొండ,వర్కట్ పల్లి,వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం 208 మందికి కరోనా ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించగా అందులో 71 మందికి పాజిటివ్ నిర్ధారణ అయిందని,వారికి కరోనా పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు తెలిపి,వారిని హోమ్ క్వారెంటైన్ చేశామని డాక్టర్లు సుమన్ కళ్యాణ్,కిరణ్ కుమార్,స్వామి లు తెలిపారు.

# ఘనంగా నూతన ఆలయంలో... శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠాపన





శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : శ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునః ప్రతిష్టాపన మహోత్సవం గురువారం నాడు అంగరంగ వైభవంగా జరిగింది. మియాపూర్ అంబేద్కర్ నగర్ కాలనీలో , అంబేద్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ రావిరాల పరమేశ్వర శాస్త్రి నేతృత్వంలో గురువారం ఉదయం నుంచి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజల అనంతరం యంత్ర స్థాపన, బింబ స్థాపన, మూల మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, ప్రణ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. 15వ తేదీన గంగకు పోవుట, పుట్ట మట్టి తెచ్చుట వంటి కార్యక్రమాలు వుండునని, 16వ తేదీ ఆదివారం నాడు ఉదయం శ్రీ పోచమ్మ తల్లి కల్యాణం, మధ్యాహ్నం గం.3 లకు బోనాల సమర్పణతో కార్యక్రమాలు ముగియునని ఆలయ కార్య నిర్వాహకులు తెలిపారు.

# జూన్ 15వ తేదీలోగా ఆసుపత్రి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి



మంచిర్యల జిల్లా ప్రతినిధి, మే 13, ప్రజాపాలన : జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను జూన్ 15వ తేదీలోగా పూర్తి చేసి అన్ని సౌకర్యాలతో ప్రారంభించేం దుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భారతి హోళీకేరి అన్నారు. గురువారం మంచిర్యాల శాసనసభ్యులు నడిపల్లి దివాకర్ రావుతో కలిసి ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గాను ఆసుపత్రిని త్వరగా అందుబాటు లోకి తేవాలని, కాలేజ్ రోడ్ నుండి ఆసుపత్రి వరకు సింగరేణి సహకారంతో తాత్కాలిక గ్రావెల్ రోడ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రారంభ సమయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఆపరేషన్ థియేటర్, పడకలు, పరికరాలతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి పర్యవేక్షకులు డా. అరవింద్ కు సూచించారు. జాతీయ రహదారుల శాఖ వారి సౌజన్యంతో వారం రోజుల లోగా ఆక్సిజన్ ప్లాంట్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు . ఆసుపత్రి నిర్మాణ పనులలో జాప్యంపై టి. ఎస్. ఎమ్. ఐ. డి. సి. అసిస్టెంట్ ఇంజినీర్ రమేష్ పై ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రస్తుతం కరోనా వైరస్ తీవ్ర స్థాయిలో విజృంభిస్తుందని, వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం అనేక రక్షణ చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో 10 రోజుల పాటు లాక్ డౌన్ విధించడం జరిగిందని తెలిపిన కలెక్టర్ ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని కోరారు. మాస్కులు ధరించడం, శానిటైజర్, సామాజిక దూరం తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ అరవింద్, అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ క్యాంటీన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు/రామచంద్రాపురం,మే 13, ప్రజాపాలన ప్రతినిధి:లాక్ డౌన్ నేపథ్యంలో నిరుపేదల ఆకలి తీర్చేందుకు జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో అన్నపూర్ణ క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు,ఆయన గురువారం పటాన్ చేరు పట్టణంలోని ఏరియా ఆసుపత్రి దగ్గర ఏర్పాటు చేసిన అన్నపూర్ణ క్యాంటీన్ నీ,అలాగే రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని బీరంగూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన అన్నపూర్ణ క్యాంటీన్ ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిహెచ్ఎంసి సౌజన్యంతో అక్షయ పాత్ర ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉచితంగా 200 మందికి భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. దినసరి కూలీలు నిరాశ్రయులు, బాటసారులతో పాటు వివిధ చికిత్సల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, అమీన్పూర్ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,కార్పొరేటర్ పుష్ప నగేష్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదర్శ్ రెడ్డి, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ బాలయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ వసుంధర, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి,గూడెం మధుసూదన్ రెడ్డి, విజయ్ కుమార్, కంకర శ్రీను, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 14, మే 2021

## వైరస్‌తో పాటు అన్ని విషాలూ విరిగిపోవాలి!

భయపెట్టకుండా, గుండెల్ని మెలిపెట్టకుండా రాయాలి. కాస్త ఆశ పుట్టేట్టు, పట్టేసిన ఊపిరితిత్తులకు కాసింత ఆక్సిజన్ తగిలేట్టు రాయాలి. బాధ్యత లేకుండా ఉండకూడదు కదా, ఎంతగా ఛిద్రమైపోతే మాత్రం మనసు, నెత్తురోడే శకలాలను ఉన్నవి ఉన్నట్టు పరిచేయకూడదు కదా? బెదరగొట్టకపోవడమే కాదు, దెయ్యాన్ని దాచేయాలి, కన్నీళ్లకీ, కళ్లలో మండే భీతికీ వేలి ముసుగు కప్పాలి. అప్రియవాస్తవానికి ప్రతిబింబమూ ప్రతిధ్వనీ కూడదు. చీకటిరోజుల్లో చీకటి గురించి రాయాలంటారు కానీ కవులు, వెలుతురు గురించే రాయాలి. ఈ ఆశావహం, సానుకూలం ఏమంత ఆషామాషీ కాదు. బీభత్సాన్ని ప్రశాంతిలోకి అనువదించడం చాలా కష్టం. రాసేవాడికి అక్షరమక్షరం మరణమే. మృత్యువు వీరవిహారం నడుమ ఆక్రందనల ఆర్తనాదాల హోరులో దృశ్యాన్ని లోపలికి వొంపుకోవడమే ఒక నరకం, మృత్యుధ్వనికి కర్ణభేరిని అడ్డుపెట్టడమే భయంకర అనుభవం. ఆ పైన ఏమీ కానట్టు, ఈ రాత్రి గడుస్తుంది లెమ్మని, వెలుతురు విరుస్తుందని హామీ పడడం, ఎంత కృత్రిమం! మనం ఇప్పుడు వల్లకాటి సమయాల్లో ఉండడమే కాదు, పరమ అసంబద్ధ ఆభాస సందర్భాలలో జీవిస్తున్నాం. ప్రాణవాయువు కోసం పరితపించే పరమ హాస్యాస్పద అభివృద్ధి కాలంలో బతుకుతున్నాం. మనిషి ఇంత కంటె ఎక్కువ హీనపడతాడా, ఇంతకు మించిన దుఃఖం ఉంటుందా, ప్లాస్టిక్ సంచుల్లోని కళేబరాలతో తాదాత్మ్యం చెందడం అంత ఊపిరాడనితనం మరొకటి ఉంటుందా, హృదయాన్ని శయ్యగా పరచి, తమ ఊపిరినే పరులకు ఊది మనుషులు అతిగొప్ప మనుషులైన సన్నివేశంలోనే, తమలోని దుర్మార్గమే ఉత్పరివర్తనం చెంది రాకాసి కీటకాలుగా మారిన అతినీచ మానవులను చూస్తున్నామా?. ఇదంతా దాటుకు వెళ్లగలిగినవారు, ఇంకొక ఏడాది తరువాత కూడా మిగిలేవారు, రానున్న సంవత్సరాలు, దశాబ్దాల పాటు ఈ దృశ్యాలను నిర్బంధంగా గుర్తు పెట్టుకుంటారు. పీడకలలుగా వాటిని కలవరిస్తారు. శ్వాసల ఎగపోతల, అంబులెన్సుల హాహాకారాల, వందలాది సామూహిక చితుల చిటపటల శబ్దాలు వారిని వెంటాడుతూనే ఉంటాయి. ఏ రాత్రీ సులువుగా గడవదు. ఎక్కడో ఒక మిత్రుడు, ఒక బంధువు, ఒక ప్రముఖుడు, ఒక ఇష్టుడు, పుంలింగమో స్త్రీలింగమో, జ్వరపడతారు, ఆయాసపడతారు, సరిహద్దుల దగ్గర పెద్ద యుద్ధమే చేస్తారు. ఎవరి గురించో అర్ధరాత్రో, తెల్లవారో, మిట్టమధ్యాహ్నామో ఒక కబురు వస్తుంది. టీవీలోనో, ఫేస్‌బుక్ లోనో, పేపర్ లోనో ఒక ఫోటో కనిపిస్తుంది. శిరచ్ఛేదపు వరుసలో మనవంతు ఎప్పుడో అని భయం వేస్తుంది. దుఃఖపడడానికి కూడా విరామం ఉండదు. మనుషులు ఉన్న పళాన ఎగిరిపోయినప్పుడు, ఉనికి పొలిమేరల దగ్గర వారికి వీడ్కోలు చెప్పడానికి కూడా లేదు, గత్తరకాలం! వాయిదావడ్డ స్మారకసభలెన్నో! పోగుపడిపోయిన కన్నీళ్లెన్నో! ఇదంతా ముగిసిపోయాక, ఒక ఎడతెగని సంతాప సభలో, మిగిలిపోయినందుకు, బతికి ఉన్నందుకు కించపడుతూ, ఎంత దుఃఖిస్తామో? అరచేతుల్లో పేరుకుపోయిన శానిటైజర్ల పొరలను వలుచుకుని ఎన్నెన్ని కరచాలనాలు చేస్తామో!ఒక్క ఓదార్పు మాట విందామంటే నాయకుడికెవడికీ నోరు రాదు. అకాశం నుంచి చూస్తే దేశం వెలిగిపోతుంటుంది. ఓట్ల కోసం అన్ని కలల్ని అమ్ముతారు కదరా, ధైర్యం ఇవ్వడానికి మాత్రం నోళ్లు పడిపోతాయి! తేలుకుట్టిన దొంగలాగా దేశనాయకుడు మౌనంలోకి వెళ్లిపోతాడు. విడదీసే మాటలు చెప్పమంటే పులకించి ప్రసంగాలు చేసే నేతలకు, మనుషులందరినీ ఒక్కటిగా నిలబెట్టి ఆపద మీద దండెత్తించడం మాత్రం రాదు. కోర్టులు అదిలిస్తే కానీ రాష్ట్రాల నాయకులకు మెలకువ రాదు. కేంద్రాన్ని పల్లెత్తు మాట అనడానికి 'పాజిటివ్' కావడం కంటె మించిన భయం. దేశపరిస్థితి విషమించి, ప్రపంచానికే ప్రమాదకరంగా మారిపోతున్నా, జాతీయవాదానికీ, మంత్రతంత్రాలకు మాత్రం గిరాకీ తగ్గలేదు. ఇంకా కొందరు గోమయం పులుముకుని వ్యాధిని తరిమికొడుతున్నారు. గోపంచకాన్ని అందరికీ సిఫారసు చేస్తున్నారు. జిస్ దేశ్ మే గంగా బహ్తీ హై, రామ్ తేరీ గంగా మైలీ, చుట్టలు చుట్టిన కళేబరాలు ప్రవహిస్తున్నాయి. విపత్తుకోసం దొరకని విత్తం, వైభవోపేతమైన విస్టా కోసం వర్షిస్తుంది. భూటాన్, బంగ్లాదేశ్ సాయం చేసినందుకు జాతీయవాదం గర్విస్తుంది. టీకాలు అమ్మకానికి పెడతామని చెప్పినందుకు మార్కెట్ హర్షిస్తోంది. అప్పుడప్పుడు పెదవి విప్పి, ప్రతిపక్షం నిద్రిస్తోంది. సమాజాన్ని, ప్రజలను నిందిస్తాము. కుంభమేళా జనాల్ని, బెంగాల్ ఎన్నికల ర్యాలీలను చూస్తే ఎవరికైనా కోపమూ నిస్సహాయతతో కూడిన బాధా కలుగుతాయి. తమ ప్రాణాల విషయంలో వారెందుకు బాధ్యతగా ఉండరు, ఇతరుల ప్రాణాల విషయంలో అంత నిర్లక్ష్యంగా ఉండే హక్కువారికేముంది– ఈ ప్రశ్నలన్నీ సహజమే. కానీ, తప్పు వారిది మాత్రమే కాదు. వారి మనసుల్లోకి చొరబడే భావాలు, అభిప్రాయాలు వారికి సరైన జ్ఞానాన్ని ఇవ్వడం లేదు. వ్యాపిస్తున్న జబ్బు గురించి తెలియకపోవడం, అది తమకు సోకదని, సోకినా తమనేమీ చేయదని అనుకోవడం, నకాలంలో వైద్యసహాయం అందుకోవాలన్న అవగాహన లేకపోవడం, ఇవన్నీ వారిని ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఒకపక్క ప్రపంచానికే టీకా అందిస్తున్నామని సైంటిఫిక్‌గా గర్వపడే దేశంలోనే, కరోనా గురించి అనేక మూఢమైన, మూర?మైన నమ్మకాలు వ్యాపింపజేస్తున్నారు. వారూ వీరూ వేరువేరు కాదు, అధికారంలో ఉన్నవారిలోనే కొందరు అట్లా మాట్లాడతారు, మరికొందరు ప్రజలను ఇట్లా ఉద్దీపింపజేస్తారు. ప్రజలకు కనుక నిజంగా అవగాహన ఉన్నా, ఈ ప్రభుత్వాల కారణంగా కరోనా వ్యాప్తి పరిమితంగా ఉండేది కాదనిపిస్తుంది. గత ఏడాది కొన్ని రోజులు లాక్ డౌన్ విధించిన తరువాత, ఆంక్షలన్నీ దాదాపుగా సడలించారు. రెండో విడత దాడి మొదలయినప్పుడు ప్రజలు ఆదమరచి ఉన్నారు, ముప్పు తెలిసినా ప్రభుత్వం హెచ్చరికలు చేయలేదు. సోకిన వారు నకాలంలో జాగ్రత్త పడి ఆస్పత్రులకు వస్తే, వారికి చికిత్స చేసేంత వ్యవస్థ మనకున్నదా అని కూడా ఆలోచించాలి. తమ తమ ఇళ్లలోనూ, ఆస్పత్రిదారులలో మార్గమధ్యంలోనూ ఎందరు చనిపోయారో తెలియదు. అనేక అంశాలపై కనీస అవగాహన ఉంటే తప్ప, ఇటువంటి కల్లోల సందర్భాలలో ప్రజలు స్వచ్ఛందంగా సహకరించరు. రాజకీయ నాయకత్వం, ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో వ్యవహరిస్తే, ప్రజలలో ఉన్న అజ్ఞానాన్ని, సహకార లోపాన్ని సర్దుబాటు చేసుకోవచ్చు. ఇంతకాలంగా కనీసస్థాయిలో మాత్రమే ఉంచుతూ వచ్చిన ఆరోగ్య వ్యవస్థ, ఒక్కసారిగా కరోనా తుఫానుకు అల్లాడిపోయింది. ఎన్నెన్ని కొరతలు ప్రాణాలు తీసి ఉండవచ్చును కానీ, ఆస్పత్రులలో ఉన్నంత మంది మనుషులలో రోగులకు చేసిన సేవల్లో మాత్రం కొరతలేదు. ఆశపడాలంటే వర్తమానంలో ఏమీ లేదు. కళ్లెదుట కనిపిస్తున్న సన్నివేశంలో ఏమీ దొరకదు. చరిత్రలోకి వెళ్లాలి. తాత్వికతలోకి మళ్లాలి. ఏదీ శాశ్వతం కాదు. ఈ ఉత్పాతమూ ఎల్లకాలం ఉండదు– అన్నది వేదాంతం కావచ్చు, చీకటి విడిపోతుందన్నది మానవానుభవం ఇచ్చే ఆశ. ఎన్ని కల్లోలాలు చూడలేదు ఈ భూమి, ఎన్నెన్ని కరువు కాటకాలను, గత్తరలను దాటి రాలేదు, ప్రపంచం అంతా తుడిచిపెట్టుకుపోదులే, అందులో మనం ఉంటామా లేదా అన్నది ఒక ప్రశ్నే కానీ, ఎవరో ఒకరు ఉంటారన్నది కూడా వాస్తవం. ఈ ముక్కుమునుగులూ దూరాలూ కొంతకాలం పాటించి, ఆ తరువాత లోకం ఏమీకానట్టు పాత ఒరవడిలోకి వెళ్లిపోవచ్చు, లేదా కొత్త దారులకు మళ్లవచ్చు. ఆస్పత్రులకు, ఆరోగ్యరంగానికి చికిత్స చేయమని అడగడానికి ఇది ఒక అవకాశం. వైరస్ కంటె ప్రమాదకరమైనదిగా మారిన మతతత్వాన్ని తరిమికొట్టడానికి కూడా ఇది ఒక అదునైన సమయం. వైఫల్యాలలో వాళ్లు కొట్టుమిట్టాడుతున్నారు. నోట మాట కూడా పెగలడం లేదు. మనసులో ఏ వ ్రా ్య ఎ ే ల ం రూపుదిద్దుకుంటున్నాయోనన్న భయాలు ఉన్నాయి కానీ, ప్రపంచం దృష్టిలోనే పలచన అయి, ఎడతెగని చావుల పరంపరకు జవాబు చెప్పుకోలేక మొహం చాటు చేసుకోవలసి వచ్చిందేమో తెలియదు. పరస్పరత ఒక్కటే మనుషులను కాపాడే విలువ. ప్రేమ ఒక్కటే ఔషధం. ఈ కష్టకాలపు అరిష్టాలను, దుష్టత్వాలను అన్నిటినీ గుర్తుపెట్టుకోవాలి. వాటన్నిటికీ యాంటీ బాడీలను సమాజంలో నిర్మించుకోగలగాలి. మంచి సమాజం అన్నది ఒక స్వప్నమే కాదు, వర్తమానంలో మనుగడకు ఒక ఆలంబన కూడా.

# "క్రమశిక్షణ అంటే రంజాన్ నెల "

ఈద్ ఉల్ ఫితర్ ముబారక్– ముస్లిం సోదర సోదరీ మనులందరికి రంజాన్ శుభాకాంక్షలు. 2020 కరోనా మహామారి కారణంగా రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోలేక పోయాము. 2021 సంవత్సరంలో నైనా ఆ బాధలు తీరుతాయని ఆశించాము. కానీ ప్రస్తుతం కరోన మహమ్మారి రెండవ దశ విజృంభణ ఎక్కువగా ఉన్న కారణంగా, కరోన కట్టడి కొరకు లాక్ డౌన్ లో 2021 రంజాన్ జరుపుకోవలసి వస్తున్నది. చాలా బాధకారమైన విషయమే కానీ తప్పని పరిస్తితి అందరం పాటించాలి.

"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాఫు అన్నీ"

ఓ అల్లాహ్! నీవు అమితంగా మన్నించేవాడవు. మన్నింపును ఇష్టపడతావు. నన్ను మన్నించు (ప్రభూ!)"

పండుగ, పర్వదినం అంటే శుభవేళ ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మన జీవన స్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతి, వికాసానికి దోహదం చేస్తూ ఉంటాయి. 'పండుగ' అనేది ఏ మతానికి సంబండిచినది అయినా దాని వెనుక ఒక సందేశం దాగి ఉంటుంది. 'పండుగ' మానవాళికి హితాన్ని భోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే ' రంజాన్ ' పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది.

ముస్లింల పండుగలు: మొహర్రం నెల, మీలాద్–ఉన్–నబి, రజబ్ నెల: షబ్–ఎ–మేరాజ్, షాబాన్ నెల : షబ్–ఎ–బరాత్ (లైలతుల్–బారాహ్), రంజాన్ నెల : జుమతుల్–విదా, షబ్–ఎ–ఖద్ర్ (లైలతుల్ ఖద్ర్), షవ్వాల్ నెల : ఈదుల్ ఫిత్ర్ (రంజాన్ పండుగ), జుల్–హిజ్జా నెల : ఈదుల్–అజ్ హా (బక్రీదు).

ముస్లింలకు పవిత్ర మాసంమైన ఈద్–ఉల్–ఫితర్/రమదాన్/రంజాన్/రమజాన్ అని ఏ పేరుతో పిలిచిన పలికేది ఆ దైవమేగా!.

రంజాన్ మాసం మొదలైందంటే ఎక్కడ చూసిన పొట్టేల్ హలీం, పిస్తా హలీం... అంటూ వివిధ రకాల పేర్లతో హలీం సెంటర్లు వెలుస్తవి. రోడ్ల వెంట అనేక రకాల పండ్లతో తోపుడు బండ్ల దుఖానాలు, ఖర్జూరా ప్యాకెట్స్ తో కళకలలాడుతవి. రంజాన్ మాసం మొత్తం సాయంత్రం కాగానే చిన్న–పెద్ద,పెద ధనిక అని తేడా లేకుండా హలీం సెంటర్ల వద్ద విపరీతమైన రద్దీ కనబడుతుంది. వివిద పార్టీల నాయకులు, సామాజిక సేవ చేసేవా సంస్థలు, మిత్రులు ఇఫ్తార్ విందులు ఇవ్వడంలో పోటీలు పడేవారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం కరోనా వైరస్ మహమ్మారి (కోవిడ్–19) రెండవ దశ కరాళ నృత్యం చేస్తున్న తరుణంలో అవన్నీ కూడా రద్దు కనుమరుగైనాయి. కరోనా వైరస్ కట్టడికి దేశవ్యాప్తంగా పలుమార్లు పొడిగిస్తూ లాక్‌డౌన్ నేటికీ అమలవుతోంది. ఇంతటి క్లిష్ట పరిస్థితులలో ముస్లిం సోదరులు పవిత్ర రంజాన్ పండుగను జరుపు కోవడం చాలా ఇబ్బంది కరమైనది. గత సంవత్సరం అంటే 2020 లో నెలల కొద్ది లాక్ డౌన్ మూలంగా అమ్మకాలు లేక వ్యాపారులు, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు, కార్మికులు మరియు వలస కూలీలు ఉపాది కరువై తినడానికి తిండి లేక ఉండడానికి వసతి లేక చంటి పిల్లలను వెంటేసుకొని కాళ్ళకు చెప్పులు కూడా లేని పరిస్థితిలో అనేక ఇబ్బందులకు ఓర్చి కాలినడకనే వేల మైళ్ళ దూరంలో ఉన్న తమ స్వంత స్థలాలకు చేరుకున్నారు.

ముస్లింలు చాంద్రమాన కేలండర్ ను అనుసరిస్తారు.

ఈ సంవత్సరం 2021 కూడా మే నెల లో రాష్ట్ర వ్యాపితంగా లాక్ డౌన్ కారంగా అదే పరిస్థితి పునరావతం అవుతున్నది.

చంద్రమానం ప్రకారం ఇస్లామియా కేలెండర్ తొమ్మిదవ నెల రంజాన్ ((RAMADAN). దీనిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దానికి ప్రధానమైన కారణం దివ్య 'ఖురాన్' గ్రంధం ఈ మాసంలో ఆవిర్భవించడమే! క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసంగా భావిస్తారు. పవిత్ర మాసం రంజాన్ మాసం ఏప్రిల్ 13,మంగళవారం నాడు ప్రారంభంమై మే 14, శుక్రవారం నాడు ముగియనుంది. డిల్లీ జామా మసీదు యొక్క షాహి ఇమామ్, సయ్యద్ అహ్మద్ బుఖారీ ఆదేశానుసారంగా ఈద్– ఉల్– ఫితర్ (రమదాన్) ను మే 14 న జరుపుకుంటున్నారు. ముస్లిం సోదర, సోదరీ మనులందరికి ఈద్– ఉల్– ఫితర్ (రమదాన్) శుభాకాంక్షలు.

"ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించబడింది. మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు (తఖ్వా) పెంపొందే అవకాశం ఉంది." (ఖుర్ఆన్ 2 : 183).

ఈ రోజున ముస్లింలు ఉపవాసం నిషేధించారు, వారు కొత్త బట్టలు ధరిస్తారు, కలిసి ప్రార్ధిస్తారు, ఒకరినొకరు కౌగిలించుకొని 'ఈద్ ముబారక్' శుభాకాంక్షలతో పలకరిస్తారు మరియు వారి సన్నిహితులు మరియు కుటుంబ సభ్యులతో విందు చేస్తారు.

రంజాన్ మాసంలో సంప్రదాయం ప్రకారం ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు జరపడం ఆనవాయితీ. అయితే, కరోనా వైరస్‌ను (కోవిడ్–19) నియంత్రించేందుకు ప్రస్తుతం లాక్ డౌన్‌తో పాటు భౌతిక దూరం పాటించాల్సిన అవసరం ఉన్నది. రంజాన్ మాసంలో ప్రార్థనల కోసం మసీదులకు వెళ్లకుండా ఎవరికి వారు తమ ఇళ్లల్లోనే రంజాన్ ప్రార్థనలు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినది.

అతి పవిత్రమైన రంజాన్ మాసం! ఈ మాసానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. అల్లాహ్ గ్రంథమైన ఖుర్ఆన్ మానవుల సన్మార్గం నిమిత్తం ఈ నెలలోనే అవతరించింది, అల్లాహ్ ఎంతో మందిని ఈ నెలలోనే నరకాగ్ని నుంచి రక్షిస్తాడు. స్వర్గ ద్వారాలు తెరుచుకునేది, నరక ద్వారాలు మూతపడేది ఈ శుభ మాసంలోనే. అంతేకాదు, ఈ నెలలో షైతానులను సంకెళ్ళతో బంధించటం జరుగుతాయి. తన దాసుల పాపాలను అల్లాహ్ ఈ నెలలో విపరీతంగా మన్నిస్తాడు. మామూలు రోజుల్లో ఒక మంచి పనికి ఒక పుణ్యం మాత్రమే లభిస్తుంది. కాని రంజాన్ నెలలో అదే మంచి పనికి మరెన్నో రెట్లు పుణ్యం లభిస్తుంది. స్వర్గంలో స్థానాలు ఉన్నతమయ్యేది ఈ నెలలోనే అని చెబుతారు.

"ఈ ప్రవక్తకు విధేయత చూపినవాడు అల్లాహ్ కు విధేయత చూపినట్లే." (అన్ నిసా 4: 80)

"దైవప్రవక్త విధేయులుగా మసలుకోండి %––% తద్వారానే మీరు కరుణించ బడతారు." (అన్ నూర్ 24 : 56)

ఈ నెలలో ఉపవాసాలు ఉండటానికి, ప్రార్థనలు జరుపుకోవటానికి, మంచి పనులు చేసుకోవటానికి శక్తిసామర్థ్యాలను ప్రసాదించమని సంవత్సరమంతా అల్లాహ్ సన్నిధిలో దీనంగా వేడుకుంటూ ఉంటారు. ఇరవై రోజుల ఉపవాసం అనంతరం ముస్లింల కోసం ఈ నెలలో ఒక్ తాయమ్ వేచి ఉంటుంది.ఆఖరి పది రోజుల్లో అమితంగా అల్లాహ్ ను ఆరాధిస్తూ,గత పాపాల మన్నింపు కోసం వేడుకుంటూ కాలం గడిపిన వారికి మాత్రమే అది ప్రాప్తమవుతున్నది.రంజాన్ ఆ ఒక్క రాత్రి అది వెయ్యి రాత్రుల కంటే గొప్పది అంటారు.నెల చివరి పది రోజుల్లో ఒక మహత్తరం ఉన్నట్లు చెబుతారు.

మరి "తఖ్వా" అంటే ఏమిటో తెలుసా? తఖ్వా అనేది ఓ గొప్ప సుగుణం. విశ్వాసికి అత్యంత విలువైన సంపద. అల్లాహ్ పట్ల భీతితో, భక్తితో చెడుకు దూరంగా జీవితం గడపటమే తఖ్వా. విశ్వాసి జీవిత మహాశయం తఖ్వా. ముస్లింలైనవారు ఈ "తఖ్వా" స్థానాన్ని పొందటానికి అనునిత్యం ప్రయత్నిస్తూ ఉండాలి. రంజాన్ నెలలో అందుకు మార్గాలు మెండుగా ఉంటాయి. అందుకే ముస్లింల మనసుల్లో రంజాన్ నెలకు అంతటి ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉన్నది.

"వినండి! ఎవరు ప్రవక్త ఆజ్ఞను ఎదిరిస్తున్నారో వారు, తమపై ఏదయినా ఘోర విపత్తు వచ్చిపడుతుందేమోనని లేదా తమను ఏదయినా బాధాకరమయిన శిక్ష చుట్టుముడుతుందేమోనని భయపడాలి." (అన్ నూర్ 24 : 63)

ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఆచరించవలసిన నియమం ' ఉపవాస వ్రతం' . ఈ ఉపవాసాన్ని పార్సీ భాషలో ' రోజా ' అని అంటారు. సౌమ్ అని పిలుస్తారు. ఈ ఉపవాస విధిని గురించి దివ్యఖురాన్ గ్రంథం .

విశ్వాసులారా! గత దైవ ప్రవక్తలను అనుసరించే వారికి ఎలా ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయో... అలాగే మీలో భయభక్తులు జనించిడానికి అదేవిధంగా ఇప్పుడు మీకు కూడా ఉపవాసవ్రతాలు నిర్ణయించబడ్డాయి' అని పేర్కొంది.

రంజాన్ నెలలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో ' జకాత్ ' అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని ' జకాత్' అని అంటారు. దీనిని పేదల ఆర్థిక హక్కుగా పేర్కొంటారు. దీని ప్రకారం ప్రతి ధనికుడు సంవత్సరాంతంలో మిగిలిన తన సంపద నుండి 30 శాతం చొప్పున ధన, వస్తు, కనకాలను ఏవైనా నిరుపేదలకు దానంగా యిస్తారు. పేదవారు కూడా అందరితో పాటు పండుగను జరుపుకొనడానికి, సంతోషంలో పాలుపంచుకునేందుకు ఈ ' జకాత్ ' ఉపయోగపడుతుంది.

'జకాత్' తో పాటు ' ఫిత్రా' దానానికి రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. మూడుపూటల తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి అభాగ్యులకు, పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం మతం ఉద్బోధిస్తూవుంది. దీనినే ' ఫిత్రాదానం' అని పిలుస్తారు. ఉపవాసవ్రతాలు విజయవంతంగా ముగిసినందులకు దేవుడి పట్ల కృతజ్ఞతగా .. పేదలకు ఈ ఫిత్రాదానం విధిగా అందజేస్తారు. ఈ ఫిత్రాదానంలో 50 గ్రాముల తక్కువ రెండు కిలోల గోధుమలను గానీ, దానికి సమానమైన ఇతర ఆహారధాన్యాలను గానీ, దానికి సమానమైన ధనాన్ని గానీ పంచిపెట్టాలి. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేయాలి. దీనివలన సర్వపాపాలు హరించబడి, పుణ్యం దక్కుతుందనే నమ్మకం ఉంది.దైవ ప్రవక్త ఫిత్రా ధానాన్ని విధిగా నిర్ణయించడానికి కారణం – ఉపవాస వ్రత నియమాన్ని పాటించే సమయంలో హృదయంలో కలిగే చెడు తలంపులు, ఆలోచనలు, నోటినుంచి వెలువడే అసత్యాలు, పనికిమాలిన మాటలు వంటి పొరపాట్లు జరుగుతూ వుంటాయి. ఇలాంటి అనాలోచిత పొరపాట్లు అన్నీ ఫిత్రాదానం వల్ల క్షమించబడతాయి ' అని మహమ్మద్? అనుచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ తెలిపాడు.

నెల పొడుపుతో రంజాన్ ఉపవాస దీక్షలు విరమించి మరుసటి దినాన్ని రంజాన్ పండుగగా నిర్ణయిస్తారు. అల్లా రక్షణ, కరుణ అందరూ పొందాలన్న ఆశయంతో ఈద్గాలో బారులుతీరి పండుగ నమాజు చేస్తారు. కొత్త వస్త్రాలు, పరిమళ ద్రవ్యాలతో వాతావరణమంతా ఆహ్లాదకరమవుతుంది. ధనిక, బీద తారతమ్యం లేక, సహృదయాలతో సద్భావనలతో ఆలింగనం చేసుకుంటారు. ద్వేషాలన్నీ సమసి ప్రేమపూరిత భావం ఇనుమడిస్తుంది. ప్రత్యేకంగా సేమ్యాతో చేసిన ఖీర్ తినిపించుకొని ముస్లింలే కాక ముస్లిమేతర సోదరులు కూడా కలిసి శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. మానవుల మధ్య నెలకొన్న వర్గ వైషమ్యాలు తొలగించి అందరిలో ఆధ్యాత్మిక చింతన కలిగించి చిరుజీవితాన్ని ఆనందంతో నింపి పుణ్యకార్యాల వైపు దృష్టి మరల్చే రంజాన్ మాసం చైతన్యాన్ని కలిగించి ముందుకు సాగే ధైర్యాన్నిస్తుంది. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తి ప్రవత్తులతో జరుపుకుంటారు. ప్రతి ఒక్కరూ కొత్త బట్టలు ధరించి పండుగ నమాజును ఊరిబయట నిర్ణీత ప్రదేశాలైన ఈద్గా హ్ లలో చేస్తారు. అనంతరం ఒకరికొకరు ' ఈద్ముభబారక్ (శుభాకాంక్షలు) చెప్పుకుంటారు.

ఈ విధంగా పవిత్ర ఆరాధనలకు ధార్మిక చింతనకూ, దైవభక్తికీ, క్రమశిక్షణకూ, దాతృత్వానికి రంజాన్ నెల ఆలవాలం అవుతుంది. మనిషి సత్ ప్రవర్తన దిశలో సాగడానికి మహమ్మద్ ప్రవక్త బోధించిన మార్గాన్ని ' రంజాన్ (ఘుఝుఝఅ)' సుగమం చేస్తుంది. ప్రపంచం మొత్తాన్ని వనికిస్తున్న కరోనా (కోవిడ్ –19 ) మహమ్మారి రెండవ దశ నుండి బయట పాడాలని మన అందరం ఈ సందర్భంగా ప్రార్థించుదాం. కరోనా లేని రంజాన్ ను వచ్చే సంవత్సరమైన జరుపుకుందాం అని ఆశిద్దాం. అందరికీ మరోసారి ఈద్ ఉల్ ఫితర్ ముబారక్– రంజాన్ శుభాకాంక్షలు

– ప్రణతి తాల్క ,భువనగిరి.

1. ముజీబ్ ఇంజనీర్ మాటలలో :

నేను భారతదేశ ప్రజలందరికీ చాలా సంతోషంగా మరియు అర్థవంతమైన ఈద్–ఉల్–ఫితర్ 2020 లో జరుగాలని కోరుకున్నాను అది నెరవేరలేదు. 2021 లో కూడా అదే పరిస్తితి కొనసాగుతున్నది. గ్లోబల్ పాండమిక్ కారణంగా ప్రపంచమంతా ఈద్గా లేదా మసీదుకు వెళ్ళకుండా ఈ గొప్ప పండుగను జరుపుకుంటున్నాము. రంజాన్ నెల మొత్తం ఉపవాసం ఉన్న ప్రజలందరూ పేదలు మరియు పేదవారిలో అర్హత ప్రకారం జకాత్ (మతపరమైన పన్ను యొక్క నిర్వచించిన మార్గం) వాటాను పంపిణీ చేస్తారు. ఈద్ రోజున సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ కు ప్రార్థన చేసే ముందు వారి కుటుంబంలోని ప్రతి వ్యక్తికి అవసరమైన ధాన్యాలు లేదా సమానమైన నగదును అవసరమైన పేదలకు ఇవ్వాలి, అందువల్ల వారు కనీస ఆహార పదార్థాలు మరియు దుస్తులతో ఈద్ జరుపుకుంటారు. ఆహారం లేదా దుస్తులు లేకపోవడం వల్ల పేద పిల్లలు నిరాశకు గురికాకూడదు. ఇక్కడ మన ఆరాధనా స్థలాలన్నీ మూసివేయబడతాయి. సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ మనకు ఇచ్చిన ఆశీర్వాదాలను మనం పట్టించు కోకపోవడమే దీనికి కారణం. మన పాపాలను క్షమించమని ఆయనతో ప్రార్థించాలి. రేపు ప్రకాశవంతంగా అడుగు పెట్టగలిగేలా మన తోటి జీవులందరినీ ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలని నేను అభ్యర్థిస్తున్నాను. అందరికీ శుభాకాంక్షలు ఈద్ ఉల్ ఫితర్ ముబారక్.

# కరోనా బాధితులకు అండగా ఉండాలి

### రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి



వికారాబాద్ మే 13 ప్రజాపాలన బ్యూరో : కరోనా తీవ్రత నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు కోవిడ్ పై అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో కరోనా భాదితులకు అండగా ఉండాలని, మెరుగైన వైద్యం అందేలా చొరవ చూపాలని మంత్రి సూచించారు. కోవిడ్ సెకండ్ వేవ్ సందర్భంగా వికారాబాద్ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై గురువారం జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 2 లక్షల 22,389 కుటుంబాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తే 6,333 మందికి స్వల్ప లక్షణాలు ఉన్నాయని, వారిలో 6026 మందికి కిట్ లు, మందులు అందించటం జరిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 14 ప్రైవేట్ ఆస్పత్రులలో 3 ఆస్పత్రులలో ఎక్కువ సంఖ్యలో రోగులకు కోవిడ్ వైద్యం అందుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2 లక్షల 36,596 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం జిల్లాలో 6,737 ఆక్టివ్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు 76 వేల 182 మందికి వ్యాక్సిన్ పూర్తి అయినట్లు, మరో 46 వేల మందికి రెండవ డోస్ వేయాల్సి ఉందని మంత్రి వెల్లడించారు. జిల్లాలో అవసరమైన మేరకు రేమిడిస్వీర్ ఇంజక్షన్లతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, మందులను కావాల్సినంత సరఫరా చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆస్పత్రుల్లో బెడ్లు పెంచటానికి కృషి చేస్తామన్నారు. వికారాబాద్ లో ఆక్సిజన్ బెడ్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కరోనా లక్షణాలు కనిపించిన వెంటనే ప్రతి ఒక్కరూ పరీక్ష చేసుకోవాలని, పాజిటివ్ అని తేలితే వెంటనే మందులను స్వీకరించాలని మంత్రి కోరారు. తాండూరు మాత శిశు సంరక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కోవిడ్ సెంటర్ లో నియమితులు అయిన డాక్టర్ లు, నర్సు లు వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ కు ఆదేశించారు. కరోనాతో చనిపోయిన రోగుల మృతదేహాలకు ప్రభుత్వం సూచించిన మేరకు ప్రత్యేక కిట్ లతో ప్యాక్ చేసి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రతి రోగి పట్ల ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రయివేటు ఆస్పత్రులను తరుచుగా తనిఖీలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారికి మంత్రి అందేశించారు. ప్రయివేటు ఆస్పత్రులలో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. కరోనా వచ్చిన వెంటనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రోగులకు మనో ధైర్యం కల్పించాలని సూచించారు. స్వల్ప లక్షణాలు ఉన్న వారు హెూమ్ ఐసోలేషన్ లో ఉండి, వైద్యులు అందిస్తున్న మందులు వాడితే సరిపోతుందన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పని చేస్తూ ఈ కష్ట కాలాన్ని అధిగమించాలని అధికారులను కోరారు. జిల్లా స్థాయిలో వేసిన కమిటీలు తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ప్రజల క్షేమం కొరకే తప్పనిసరి పరిస్థితుల్లో లాక్ డౌన్ విధించడం జరిగిందని, అందరూ సహకరించాలని కోరారు. లాక్ డౌన్ ను పూర్తి స్థాయి లో అమలు పర్చాలని ఎస్ పి ని మంత్రి ఆదేశించారు. పరీక్షలు చేసుకుని ఇంట్లో ఉండేవాళ్ళు చాలా మంది పేదవాళ్ళు కాబట్టి ఎక్కువ ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పరిగిలో కూడా ఐసోలేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడి రోగులకు అక్కడే పూర్తి స్థాయి వైద్యం, చికిత్స అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. లాక్ డౌన్ సమయంలో వ్యవసాయానికి మినహాయింపు ఇచ్చినందున రైతులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అధికారులను కోరారు. సీఎం కేసిఆర్ పెద్ద మనసుతో రైతుల సంక్షేమం కోరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఈ ప్రక్రియకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కరోనాను కట్టడి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. వెంటిలేటర్లు, ఔషదాలు, ఆక్సిజన్ ఎంత సమకూర్చినప్పటికీ ప్రజా చైతన్యంతోనే కరోనా మహమ్మారిని రూపుమాపగలమని మంత్రి అన్నారు. కోవిడ్ ఉధృతమవుతున్న ఈ సమయంలో ప్రజల్లో అవగాహన కల్పించడం అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు మాస్క్ పెట్టుకునే విధంగా, భౌతిక దూరం పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ దిశలో ప్రజలను చైతన్య వంతులను చేయాలనీ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి అధికారులందరూ కోవిడ్ కేంద్రాలను సందర్శించి రోగులకు కూడా ధైర్యాన్ని అందించాలని కోరారు. కరోనా నివారణ పద్ధతులు, వాక్సినేషన్ పై మరింత అవగాహన పెంపొందించాలని కోరారు. లాక్ డౌన్ వల్ల రెండో విడత వాక్సిన్ తీసుకొనే వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కాలే యాదయ్య, పైలట్ రోహిత్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పౌసుమి బసు, ఎస్పీ నారాయణ, విద్యా మౌళిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణ,. జిల్లా విద్యాధికారి రేణుక దేవి, జిల్లా వైద్యాధికారి సుధాకర్ షిండే తదితరుల్ను పాల్గొన్నారు.

## కరోన నియంత్రణకు మధిర మున్సిపాలిటీ లో మరో హైడ్రోక్లోరిక్ యంత్రం ఏర్పాటు:చైర్మన్ లత



మధిర ప్రజా పాలన ప్రతినిధి 13వ తేదీకరోన మహమ్మారి రోజురోజుకు విజృంభిస్తున్న తరుణంలో ఇప్పటికే ఒక హైడ్రోక్లోరిక్ యంత్రంతో మధిర మున్సిపాలిటీలో నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని అయితే ఒక యంత్రం సరిపోకపోవడంతో ఈ సందర్భంగ్గా మాట్లాడుతూ చైర్మన్జి లతా జిల్లా పరిషత్రిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు సూచనమేరకు మరో యంత్రాన్ని మున్సిపాలిటీలో ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతా జయకర్ పేర్కొన్నారు. ఈరోజు 20వ వార్డు లో హైడ్రోక్లోరిక్ యంత్రాన్ని మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ వై వి అప్పారావు 19 వార్డు కౌన్సిలర్ మాధవి 20వ వార్డు కౌన్సిలర్ ముత్తవరపు రాణి,ఫ్యారి, ఎర్రగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనా పై అప్రమత్తం గా ఉండాలి

### పుష్పలత మేడం, సర్పంచ్ ఆవుల జాన్సీ కిరణ్




మధిర,మే 13, ప్రజాపాలన ప్రతినిధి: ఇంచార్జ్ వైద్య అధికారిణి %ఎతీ% పుష్పలత మేడం ఫీల్డ్ విజిట్ లో భాగంగా మండల పరిధిలో రాయపట్నం, దేశినేనిపాలెం గ్రామాలను సందర్శించి గ్రామాల్లో కరోనా తీవ్రత గురించి తెలుసుకున్నారు. ముందుగా పారామెడికల్ సిబ్బంది ద్వారా రాయపట్నం జి పి లో గర్భిణీ స్త్రీలను పరీక్షలు చేసి తగిన ఆరోగ్య సలహాలు ఇచ్చారు. అదే విధంగా దేశినేని పాలెం ఆంధ్రప్రదేశ్ చెక్ పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రాంత%శీ% నుండి ప్రయాణికుల రాక పోకలు జ్వరాలు తనిఖీ గురించి పారామెడికల్ ద్వారా తెలుసు కున్నారు. అదే విధంగా గ్రామం లో ఉన్న కరోనా బాధితులు గురించి సర్పంచ్ ఆవుల జాన్సీ కిరణ్ తో పాటు వారి కుటుంబాల ను కలసి వారి యెక్క బ్రీతింగ్ రేటు ను పరిశీలించినారు. చెక్ పోస్ట్ వద్ద ప్రయాణికులకు కరోనా జాగ్రత్త లు గురించి వివరించారు. కార్యక్రమం లో %ఎం% కొండయ్య %ష్ఠం% కాంతలీల %ఖఅఎ% జయమ్మ %ఖఅఎ% విజయ జీపి సిబ్బంది ఆశ వర్కర్లు పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్మా దానానికి సంసిద్ధత వ్యక్తం చేస్తూ టెస్టుల నిమిత్తం రక్త నమూనాలనందించిన వాసాల గణేష్ దంపతులు



కోరుట్ల, మే13(ప్రజాపాలన ప్రతినిధి): స్థానిక కోరుట్ల ప్రెస్ క్లబ్, చేయూత స్వచ్ఛంధ సేవా సంస్థ మరియు కోరుట్ల యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న ప్లాస్మా దాతల సేకరణలో భాగంగా చేయూత స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షుడు వాసాల గణేష్ ( %దీ% పాజిటివ్ ) – సంగీత ( %ూ% పాజిటివ్ ) దంపతులు ప్లాస్మా దానానికి సంసిద్ధత వ్యక్తం చేస్తూ యాంటీ బాడీస్ టెస్టుల నిమిత్తం వారి రక్త నమూనాలనందించారు.

## లాక్ డౌన్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలి:మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



ఆసిఫాబాద్ మే 13, ప్రజాపాలన ప్రతినిధి:ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కరోనా ను నియంత్రించేందుకు ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ నిబంధనలను కట్టు దిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాలయ, ధర్మాదాయ శాఖ, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తో కలిసి కె బి ఆసిఫాబాద్ జిల్లా కు సంబంధించిన కోవిడ్ –19 కాల్ సెంటర్ గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో లాక్ డౌన్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, కోవిడ్ కట్టడికి మానవతా దృక్పథంతో వ్యవహరించాలని తెలిపారు. ప్రజల సౌకర్యం కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనం లో కోవిడ్ కంట్రోల్ రూమ్ లో టోల్ ఫ్రీ నెంబర్ 08733 279333 ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా కోవిడ్ క్వారం టైన్ , ఐసోలేషన్ కేంద్రాలతో పాటు కోవిడ్ కు సంబంధించిన వివరాలు, సూచనలు, సలహాలు, అందించారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి): జగిత్యాల నియోజకవర్గ ముస్లింల పవిత్ర పండుగైన రంజాన్ ను పురస్కరించుకోని ముస్లిం సోదర సోదరీమణులకు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పవిత్రతకు త్యాగానికి చిహ్నామని పండుగను భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం రంజాన్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించిందని కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో లాక్డౌన్ కొనసాగుతున్నందున రంజాన్ పండుగను ఎవరి ఇంట్లో వారే కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవాలని కోరారు.

## ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పర్యవేక్షించిన మండల ప్రత్యేక అధికారి సాయిబాబా



గోలపల్లి, మే 13 (ప్రజాపాలన ప్రతినిధి):జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెనుగుమట్ల గ్రామంలోని ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ సాయి బాబా మరియు ఐకెపి ఏపీఎం త్రివేణి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించినారు కొనుగోలు కేంద్రంలో గన్నిబగులు పాడిక్లినర్ విద్యుత్ సరఫరా లైటింగ్ హమాలి మార్కెటింగ్ సేవలు రైతులు తో మాట్లాడుతూస్పెషల్ ఆఫీసర్ తెలుసుకున్నారు. ఏపీఎం మాట్లాడుతూ సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తూసేవలు అందించాలని తేమశాతం యంత్రం తూకంలో పారదర్శకం సకాలంలో మిల్లుకు ధాన్యం రవాణా వాహనాలు ఏర్పాట్లు టార్పాలిన్ ఇతర మౌలిక వసతుల కల్పన వినియోగం రైతులకు శిబ్బందికి చలువ పందిరి వసతి రక్షిత శుద్ధజలం ఓఆర్ఎస్ శానిటైజర్ మాస్కులు వడదెబ్బకు గురికాకుండా స్వయంగా రక్షణ కల్గివుండలని ప్రథమ చికిత్సకిట్ తప్పనిసరిగా కేంద్రంలోఅందుబాటులో ఉంటాయి అనితెలిపారు. ప్రతి ఒక్కరూ కోవిడ్–19 నిబంధనలు ఎవరికి వారు స్వీయ నియంత్రణగా పాటించాలని తెలిపినారు. ఈకార్యక్రమంలో ఐకేపీ గ్రామ ఐక్యసంఘాకమిటీ సభ్యులు వివోఏ నిర్మల స్రవంతి జలజ వసంత బుక్ కీపర్ సతీష్ గౌడ్ రైతులుమహిళా రైతులు హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా పాజిటివ్ వచ్చిన నిరుపేదలు మనోధైర్యం కోల్పోవద్దు:టిఎస్‌పిఎ గుడ్ల శ్రీనివాస్



బాలపూర్, మే 13, ప్రజాపాలన ప్రతినిధి: టి ఎస్ పి ఏ రాష్ట్ర అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ నిరుపేద ప్రజలకు కరోనా పాజిటివ్ వస్తే మనోధైర్యంతో ఉండాలిని, డాక్టర్ల సలహా తో మంచి పోషకాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉన్నటువంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కోవిడ్ టెస్టుల కోసం వస్తున్న పేద ప్రజలకు అందుబాటులో ఉండాలని స్వేరోస్ సంస్థ అధ్వర్యంలో సంస్థ అధినేత సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఐపీఎస్, ఏ డి జి పి తెలంగాణ రాష్ట్రంలో కోవిడ్ 19 తో బాధపడుతున్నా స్వేరోస్ కిట్ పేద ప్రజలకు పల్సమేటర్, థర్మా మీటర్ , మాస్క్ లు , హ్యాండ్ బ్లౌజులు గురువారంనాడు అందజేశారు. ఈ సందర్భంగా గుడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ..... ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలు కరోనా పాజిటివ్ వచ్చిందని తెలిసిన వెంటనే పల్స్ మీటర్ తో చెక్ చేసి వారికి ధైర్యం చెప్పాలి, ఒక్క వెళ్ళ 92 వస్తె వెంటనే ఆస్పత్రిలో చికిత్స అందించాలి అన్ని కోరారు. కరోనా పాజిటివ్ వస్తె ధైర్యంగా ఉండాలి, డాక్టర్ల సలహా తో మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలి,హ్యాయమం చేయాలి టైం కు మందులు వేసుకోవాలి అవిరి పట్టాలిని కోరారు. కరోనాను కట్టడి చేయాలంటే ప్రతి ఒక్కరు ఈ జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపీఎస్ ధ్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ మహారాజ్, డాక్టర్ గుడ్ల వినయ్ కుమార్, స్వచ్ఛంద సంస్థ సమాజిక నాయకులు సిల్వేర్ సాంబశివ, మీర్పేట్ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కరోనా పేషెంట్లకు ఉచిత భోజన పంపిణీ



మేడిపల్లి, మే13 (ప్రజాపాలన ప్రతినిధి) :కరోనా బారిన పడి హెూమ్ ఐసోలేషన్లో ట్రీట్మెంట్ తీసుకుంటున్న కరోనా పేషెంట్లకు ఉచిత భోజన పంపిణీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మధ్యాహ్న భోజనం రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ నిబంధనలను ప్రజలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు బండారు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి సంకూరీ కుమారస్వామి బీజేపీ నాయకులు వులుగొండ నారాయణదాసు, సంతోష్ గుప్తా, తాళ్ల బాలకృష్ణ, గంట పాక మాణిక్యం, కామేష్, శైలేందర్ , ప్రభాకర్ రెడ్డి, పరి శ్రీనివాస్, ఈ ప్రభాకర్, దేవా తదితరులు పాల్గొన్నారు.

## కోన సహకారంతో కరోనాతో బాధపడుతున్న వారికి.బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ



మధిర మే 13, ప్రజాపాలన ప్రతినిధి:మధిరలో.. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోర్నాల కరోనా మహమ్మారి సోకటం వల్ల బయటకు రాక ఆకలితో అలమటిస్తూ అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో.. మానవతా దృక్పథంతో. ప్రముఖ పారిశ్రామిక వేత్త. పేదల పాలిట దేవుడు. గౌరవనీయులు కోన జనార్ధన్ రావు గారి ఆర్థిక సహకారంతో 15 కుటుంబాలకు.(దెందుకూరు జిలుగు మాడు లడక బజార్ హనుమాన్ కాలనీల లో) నివసించే వారికి నిత్యావసర సరుకులు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో.. మధిర రెస్క్యూ టీం దోర్నాల రామకృష్ణ నిస్సి హరిని. కొండ పాల్గొన్నారు.

## వరదలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రావద్దు



మేడిపల్లి, మే13 (ప్రజాపాలన ప్రతినిధి) : వర్షాలతో వచ్చే వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా డివిజన్లోని ఉప్పల్ హిల్స్ లో 23 లక్షల వ్యయంతో వరద కాలువల నిర్మాణాలను చేపట్టామని ఉప్పల్ కార్పొరేటర్ మందముల్ల రజితపరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు అధికారులు, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ వరద కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. వరద నీటి కాలువ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వసంత,సుధాకర్ యాదవ్ ,నవీన్ యాదవ్ ,కుమార్ ,అబ్బయ్య,గోవర్ధన్ ,శ్రీనివాస్ ,రాజు చారి ,గోవింద్ కుమార్ ,రాజు ,రవీందర్ అశోక్ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ సోదరులకు రంజాన్ దుస్తువుల పంపిణి

కోరుట్ల, మే13 (ప్రజాపాలన ప్రతినిధి): కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదేశానుసారం కోరుట్ల మండలం లోని పైడిమడుగు గ్రామంలో నిరుపేద ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ధమ్మ భీమా రెడ్డి ప్రారంభించి, ముస్లిములందరికి ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మైనారిటీ సోదరులు సామాజిక దూరాన్ని పాటిస్తూ మాస్క్ లు ధరించి పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాస్య రాము,ఎంపీటీసీ మాదిరి గోపాల్, పి.ఏ.సీ.స్ చైర్మన్ జగన్ మోహన్ రావు, డైరెక్టర్ తిరుపతి గౌడ్ ,వార్డ్ మెంబర్స్ ,మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.



# లాక్‌డౌన్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు: సీఐ ఓ.మురళి



మధిర మే 13, ప్రజాపాలన ప్రతినిధి:రాష్ట్రంలో అమలు లోకి వచ్చిన లాక్ డౌన్ ఆంక్షల నేపథ్యంలో మధిర సర్కిల్ పరిధిలో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు మధిర సిఐ ఓ మురళి పేర్కొన్నారు. బుధవారం మధిర సర్కిల్ పరిధిలోని సరిహద్దు చెక్ పోస్టులను తనిఖీ చేసిన ఆయన లాక్ డౌన్ నిబంధనలపై కఠినంగా వ్యవహరించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు లోబడి అంతర్రాష్ట్ర రవాణా అనుమతించిన జరుగుతుందని తెలిపారు ప్రజలు అత్యవసరమైతే తప్ప వాహనాలతో రోడ్లపైకి రాకూడదని నిబంధన అతిక్రమించి వ్యవహరించే వారిపై కఠిన చర్యల తో పాటు కేసులు నమోదు చేయనున్నట్లు సిఐ తెలిపారు అలాగే వర్తక వ్యాపార వర్గాలు ఇతర దుకాణాలు నిర్దేశిత సమయాలలో మాత్రమే తెరిచి ఉంచాలని గుంపులు గుంపులుగా జనాలను అనుమతించరాదని మాస్కులు లేకుండా శానిటైజేషన్ చేపట్టకుండా ప్రజలు తిరగరాదని, విచ్చలవిడిగా వ్యవహరించరాదని పేర్కొన్నారు సాయంత్రం మది ర పట్టణంలో ఏర్పాటుచేసిన చెక్పోస్ట్ ల వద్ద పరిస్థితులను రూరల్ %ంఱ% రమేష్ కుమార్, పట్టణ ప్రో.%ంఱ% శాఖీర్ లతో సమీక్షించారు . ఇప్పటికే సర్కిల్ పరిధిలో నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ప్రజలు నిబంధనలు పాటిస్తూ సహకరించాలని ఆయన కోరారు.



## ముస్లిం సోదరులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ ప్రకాశం చారి

జిన్నారం,మే 13, ప్రజాపాలన ప్రతినిధి:జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు కొత్త బట్టలు పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ ప్రకాష్ చారి అందజేశారు,ఈ సందర్భంగా సర్పంచ్ ప్రకాష్ చారి మాట్లాడుతూ ఈ రంజాన్ వేళలు ప్రతి ఒక్క ముస్లిం సోదరులు ఈ పండుగను భౌతిక దూరాన్ని పాటిస్తూ మాస్కులు ధరిస్తూ శానిటైజర్ వాడుతూ పండుగను జరుపుకోవాలని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేష్ బాబు వార్డు సభ్యులు పూజారి వీరేశంగౌడ్ దాదా పాషా పాల్గొన్నారు

## కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలి

**డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్**
**ఖిరిడి గ్రామంలో ప్లే కార్డులతో నిరసన**

ఆసిఫాబాద్ జిల్లా మే13(ప్రజా పాలన, ప్రతినిధి): కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని, ప్రతి గ్రామంలోని రైతు వేదికను క్యారంటైన్ గా మార్చి, ఇంటింటి సర్వే లు చేస్తున్న ఆయా శాఖల సిబ్బందికి రూ 50 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని, జిల్లాలోని ఖిరిడి గ్రామంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం నాయకులు ప్లే కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ మాట్లాడుతూ దేశంలో కరోనా సెకండ్ వేవ్ చాలా తీవ్రంగా వ్యాపిస్తుందని, కరొనా ను అరికట్టే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కేంద్రం రాష్ట్రాలకు కనిపించే వ్యాక్సిన్ విషయంలో చాలా అలసత్వంగా వ్యవహరిస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల ప్రజలకు కోవిడ్ వ్యాక్సిన్ అందించాలని, ఆక్సిజన్ బెడ్లు, ఇంజక్షన్, మందులు బ్లాక్ మార్కెట్లు నియంత్రించాలని, హెల్త్ కేర్ వర్కర్లకు ఆక్సిజన్ సరఫరా వర్కర్లకు, అంత్యక్రియలు నిర్వహించే వారికి రూ 50 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించి, కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్స్, లలో ఫీజుల ను అరికట్టించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు దుర్గం వాసుదేవ్, జాడి తిరుపతి, నిఖిల్, ఆకాష్ లు, ఉన్నారు.




## కేసీఆర్ నగర్ కాలనీలో పర్యటించిన మునిసిపల్ కమీషనర్





సిద్దిపేట మే 13, ప్రజాపాలన ప్రతినిధి:మునిసిపల్ కమీషనర్ డా.కెవి.రమణా చారి గారు కేసీఆర్ నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలో ఎక్కడ కూడా బయట చెత్త వేయరాదని , బట్ట ముక్కలు , ప్లాస్టిక్ కవర్ లు వంటివి బయట వేయడం వల్ల అవి %ఖ+ణ% ఛాంబర్ లో ఇరుక్కుపోయి డ్రైనేజి లోని నీరు బయటకు రావడం వల్ల చుట్టుపక్కన ఉన్న నివాసితు లందరికి ఇబ్బంది కలుగుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. కాలనీలో తిరుగుతున్న సందర్భంలో 64 బ్లాక్ వద్ద డ్రైనేజి సమస్యని గుర్తించి వెంటనే జెట్టింగ్ మిషన్ ద్వారా డ్రైనేజీలో ఇరుక్కుపోయిన బట్ట ముక్కలు,డైపర్ లు , ప్లాస్టిక్ కవర్ లను జెట్టింగ్ మిషన్ ద్వారా బయటకు తీయించారు. ఇదివరకే ఈ సమస్యను గౌరవ మంత్రి గారి దృష్టికి సైతం వచ్చిందని వెంటనే సమస్య పరిష్కరించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కరోన మహమ్మారి విజృంభిస్తున్నందున ఎవరు కూడా బయట తిరగరాదని , మాస్కులు , సానిటైజర్ లు వాడాలని మునిసిపల్ కమీషనర్ కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.

## గుర్తు తెలియని వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చిన ఎస్ఐ విజయ్ కృష్ణ




గుమ్మడిదల, మే 13, ప్రజాపాలన ప్రతినిధి:గుమ్మడిదల మండలం బొంతపల్లి ప్రధాన రహదారి పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని గమనించిన స్థానికులు గుమ్మడిదల పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించగా వెంటనే ఎస్ఐ విజయ కృష్ణ స్పందించి మైత్రీ ఫౌండేషన్ అంబులెన్స్ సహాయంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత చాటారు, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అని వైద్యులు తెలిపారని ఆయన అన్నారు.

## నిరుపేదలకు సీఎం ఎల్లవేళలా అండ దండాలు

బాలపూర్:(ప్రతినిధి) ప్రజా పాలన : మంత్రి ఆదేశం మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఎంతో అండని మీర్ పేట్ కార్పొరేషన్ 9 వ డివిజన్ కోఆర్డినేటర్ రామిడి నర్సిరెడ్డి పేర్కొన్నారు. మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిదో డివిజన్ నంది హిల్స్ రోడ్ నెంబర్ 12, లోని నివాసమైన విజయలక్ష్మి కృష్ణారెడ్డి అనారోగ్యంతో చికిత్స తీసుకోవడం జరిగింది. టిఆర్ఎస్ కోఆర్డినేటర్ అయినటువంటి రామిడి నర్సిరెడ్డి ఆధార అభిమానులతో 60 వేల రూపాయల చెక్కును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా అందజేశారు. విజయలక్ష్మి కృష్ణారెడ్డి దంపతులు నర్సిరెడ్డి తో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేశారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| డి. వరప్రసాద్ | - | తెల్లాపూర్ | - | 9553999990 |
| గణేష్ | - | బాలాపూర్ | - | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| టి. సురేష్‌చారి | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| కళ్యాణ్ సి.ఎం. | - | కూకట్‌పల్లి | - | 7842672389 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| శైలజ | - | శేర్లింగంపల్లి | - | 8919627871 |
| సత్య కిషోర్ | - | సిద్దిపేట | - | 6309723472 |
| సిహెచ్.ఆంజనేయులు | - | పరిగి | - | 966410714 |
| సి.మోహన్ | - | క్యాతనపల్లి | - | 9849720940 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492417684 |
| బోడ మమత | - | జగిత్యాల | - | 9491127684 |
| ఓవి.దుర్గారావు | - | భద్రాద్రి కొత్తగూడెం | - | 9581872881 |
| జె.రాంబాబు | - | అశ్వరరావుపేట | - | 9505678245 |
| బి.శ్రీకాంత్ | - | భద్రాచలం | - | 9398430470 |
| సి.సుధీర్‌కుమార్ | - | సుజాతనగర్ | - | 9701992529 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | - | పాలేరు | - | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | - | మయూర్ సెంటర్ | - | 9160400339 |
| మాలేడు నరేందర్ | - | ఖమ్మం రూరల్ | - | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | - | ఖమ్మం టౌన్ | - | 9948327333 |
| జి.కోటేశ్వరరావు | - | మధిర రూరల్ | - | 7793953443 |
| కె.సత్యం | - | పటాన్‌చెరు | - | 9866500289 |


## లాక్ డౌన్ పర్యవేక్షించిన రాచకొండ డిసిపి సన్ ప్రీత్ సింగ్




బాలపూర్:(ప్రతినిధి) ప్రజాపాలన : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాచకొండ డి సి పి సన్ ప్రీత్ సింగ్ లాక్ డౌన్ సంపూర్ణంగా జరిగిందని పేర్కొన్నారు. మీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మందమల్లమ్మ చౌరస్తా, బాలాపూర్ శివాజీ చౌక్ దగ్గర మీర్ పేట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేందర్ రెడ్డి, బాలాపూర్ పోలీస్ స్టేషన్ సిఐ భాస్కర్ ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ లో పోలీస్ సిబ్బందితో ప్రజలకు అవగాహన కరోనా కట్టడి చేయడానికి ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తూ లాక్ డౌన్ పకడ్బందీగా చేపట్టారు. ఉల్లంఘించిన వారికి కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ చెక్పోస్టులను పరిశీలించడానికి బుధవారం నాడు రాచకొండ డిసిపి సన్ ప్రీత్ సింగ్ పర్యవేక్షించారు. అనంతరం డిసిపి మాట్లాడుతూ.... మొదటిరోజు



కావున లాక్ డౌన్ పాదచారులకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ బయటికి రావద్దనీ అత్యవసరం ఉంటేనే రావాలని, లేనియెడల నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారికి కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ముందు ముందుగా లాక్ డౌన్ స్ట్రిక్ట్ గా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పోలీస్ సిబ్బంది, బాలాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, బాలాపూర్ మండలం ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బండారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి ఆర్థిక సహాయం చేసిన ఎంపీపీ రవీందర్ గౌడ్



జిన్నారం, మే 13, ప్రజాపాలన ప్రతినిధి:జిన్నారం మండలం రాళ్ల కత్వ గ్రామంలో జింక రాము, చెల్లెలు జింక అర్చన వివాహానికి జిన్నారం మండలం ఎంపీపీ రవీందర్ గౌడ్ ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, రాము,యాదగిరి గౌడ్,యనగండ్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో నామ్ కే వాస్తే గుట్కా నిషేధమా ?




సిద్దిపేట, మే 13, ప్రజాపాలన ప్రతినిధి:సిద్ధిపేట పట్టణంలో గుట్కా నిషేధం పేరుకు మాత్రమే అమలు అవుతుందా అంటే అవుననే సమాధానం వస్తుంది. తెలంగాణ వ్యాప్తంగా గుట్కా ని నిషేదించారు , మరి మన సిద్దిపేటలో ఈ నిషేధం సంపూర్ణంగా అవలంబించుకోవట్లేదన్న వాదన ప్రజలలో బలంగా ఉంది . దీనికి కారణం నిషేదిత గుట్కా అమ్మకాలపై అధికారుల నియంత్రణ లేకపోవడం , ఎదో తూతూ మంత్రంగా అప్పుడప్పుడు కొన్ని అరెస్టులు చూపించినా సంపూర్ణంగా గుట్కాను రూపుమాపలేకపోవడం విచిత్రం. గుట్కా తో పాటు చూయింగ్ టొబాకో కూడా సిద్దిపేటలో విరివిగా అమ్ముడవుతున్నట్లు సమాచారం. గుట్కా అమ్ముతున్న వారిపైనే కాకుండా గుట్కా తింటున్న వారిపైన కూడా చర్యలు తీసుకుంటే దీని నిషేధం సంపూర్ణం చేయవచ్చుంటున్నారు జనం . ఈ విషయంలో పై అధికారులు స్పష్టతతో కఠినంగానే ఉన్న కింద స్థాయి , ఇన్స్పెక్షన్ చేసే అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది అనుకుంటున్నారు జనం.కొన్ని చోట్ల గృహాలలో గుట్కా ప్యాకెట్ లను స్టోర్ చేసి అక్కడినుండి షాప్ లకు విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్న సంఘటనలు గతంలో కోకొల్లలు. అధికారులు కూడా గుట్కా తినడం వల్ల అనర్థాలను ప్రజలలో ప్రచారం చేస్తున్నారే తప్ప గుట్కా అమ్మడం వల్ల ఉండే శిక్షలను ప్రచారం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇకనైనా సిద్ధిపేట జిల్లాలో అధికారులు గుట్కా నిషేధం సంపూర్ణంగా అమలు చేస్తారని ఆశిద్దాం.

## కరోనా బాధితులను ఆదుకోవాలి

**సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ రాష్ట్ర కమిటీ సభ్యులు గోగర్ల తిరుపతి**



ఆసిఫాబాద్ జిల్లా మే13(ప్రజా పాలన, ప్రతినిధి): కరోనా మహమ్మారిని కట్టడి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గోగర్ల తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా బాధితులను ఆదుకోవడంలో విఫలం అయ్యాయని, ప్రభుత్వాల వైఖరిని ప్రజలు గమనించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గత సంవత్సరం లాక్ డౌన్ సమయములో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మన దేశ ధనికులు కొంతమంది పెద్ద ఎత్తున ప్రజలను ఆదుకోవడం కోసం విరాళాలు ప్రభుత్వాలకు ఇవ్వడం జరిగిందని, ఆ సొమ్మును ప్రభుత్వ నాయకుల ఇళ్లలోకి వెళ్ళిపోయాయి అన్నారు. ఇప్పటివరకు పేద ప్రజలకు ఎలాంటి సౌకర్యాన్ని కానీ, హాస్పిటల్స్ సౌకర్యాలను కానీ, చేయలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, వారి ఆరు నెలల జీత భత్యాలను, పేద ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు చేయాలన్నారు. కరోనా సోకి బాధపడుతున్న కుటుంబాలకు ఆర్థిక సహాయంగా రూ 2 లక్షలు, కరోనాతో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ 10 లక్షలు ఇవ్వాలని కోరారు.

**బిసి నోట్‌బుక్**

# భారత రాజ్యాంగ రూపకల్పన క్రమం



ఆధునిక రాజ్యాంగ మౌలిక అంశాలు, తాత్వికతలు

4.1. కార్ట్ జె. ఫెడరిక్ తన పుస్తకం "కాన్‌స్టిట్యూషనల్ గవర్నమెంట్ అండ్ డెమోక్రసీ" లో ఇలా అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో మూడు రాజకీయేతర సిద్ధాంతాలు ఉంటాయి. అవి: 1) తాత్విక పరమైనవి, 2) శాసనిక పరమైనవి, 3) చారిత్రక పరమైనవి. ఇందులో మొదటిది ఉత్పత్తిపరమైనది. కాగా తరువాతవి రెండు నిర్దిష్టమైనవి.

రాజ్యాంగ శాసనం

4.2. రాజ్యాంగం విషయంలో మాదిరిగానే రాజ్యాంగ శాసనానికి కూడా ఖచ్చితమైన నిర్వచనమంటూ లేదు. సాధారణంగా ఈ పదబంధం ప్రభుత్వంలోని ముఖ్యమైన అంగాల నిర్మాణాన్ని క్రమబద్ధీకరించుటకు వాటిలో ఒకదానికి మరొక దానితో గల అంతర్ సంబంధాలను చెప్పేవిగాను, ఆ అంగాల ప్రధాన కర్తవ్యాలను తెలియచెప్పేవిగాను ఉంటుంది.

భారత రాజ్యాంగం ఒక ఉత్కృష్టమైన గ్రంథం

4.3. భారత రాజ్యాంగం ఒక ఉత్కృష్టమైన గ్రంథం. దీని రచనలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వాళ్లంతా మహనీయులు, స్వాతంత్ర్య ఉద్యమంలో కలలుగన్న భవిష్యత్ స్వప్నాలను సాకారం చేయడానికి భారత రాజ్యాంగం ఒక ప్రతీకగా రూపొందింది. రాజ్యాంగ నిర్మాణం వెనుక శతాబ్దాల చరిత్ర, పరిణామం ఉంది.

ఇండియా ప్రభుత్వ చట్టం 1858:

4.4. మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం 1957-58 సం॥లో జరిగింది. అటు తరువాత ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వ పరిపాలనను బ్రిటీష్ సామ్రాట్టు స్వయంగా చేపట్టాడు. బ్రిటిష్ పార్లమెంటు, బ్రిటిష్ ప్రభుత్వ ప్రత్యక్ష పరిపాలన క్రింద భారతదేశ ప్రభుత్వాన్ని ఏర్పరచుటకు మొదటి శాసనాన్ని తీసుకొచ్చింది. అదే ఇండియా ప్రభుత్వ చట్టం 1858. ఈ చట్టం భారతదేశ పరిపాలనలో సంపూర్ణమైన సామ్రాట్ నియంత్రణ సూత్రమును నిబంధిస్తున్నది. స్థానిక ప్రజలను దేశ పరిపాలనలో ఏ విధంగాను పాల్గొనడానికి అనుమతించలేదు. ఈ శాసనం భారత రాజ్యాంగ పరిణామంలో మైలురాయిగా పేర్కొనవచ్చును. ఎందుకంటే ప్రస్తుత రాజ్యాంగ రూపకల్పన వరకు గల తదుపరి చరిత్ర క్రమేపీ సామ్రాట్ నియంత్రణ సడలింపు బాధ్యతాయుత ప్రభుత్వ ఎదుగుదలకు దోహదపడింది.

ఇండియన్ కౌన్సిల్ చట్టాలు 1861, 1862, భారత ప్రభుత్వ చట్టాలు 1909, 1919.

4.5. ఇండియన్ కౌన్సిల్ చట్టాలు 1861, 1862 తర్వాత భారత ప్రభుత్వ చట్టం - 1909 అమలులోకి వచ్చింది. అది మింటో-మార్లె సంస్కరణల నుండి రూపుదిద్దుకున్నవి. తర్వాత భారత ప్రభుత్వ చట్టం 1919 అమలులోకి వచ్చింది. ఆ చట్టం కేంద్ర పాలన, ప్రాంతీయ పాలన అనే రెండు వ్యవస్థలను ప్రవేశపెట్టింది. 1919 భారత ప్రభుత్వ చట్టం మాంటేంగ్ చేమ్స్‌ఫర్డ్ అనే పేరుతో అనేక సంస్కరణలకు దారి తీసింది. ఈ చట్టం ద్వారా ఆంగ్లేయులు మనదేశంలో ద్వంద్వ పరిపాలనను ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా శాసనసభ నిర్మాణంలో ఎక్కువ ప్రజాప్రాతినిధ్యానికి అవకాశం ఏర్పడింది. తొలిసారిగా కేంద్రంలో ద్విసభా విధానం అమలులోకి వచ్చింది. దిగువ సభను లెజిస్లేటివ్ అసెంబ్లీ అని ఎగువ సభను కౌన్సిలర్ స్టేట్స్ అని పిలిచేవారు. 1919 భారత ప్రభుత్వ చట్టంలో మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వ విషయాలు, రాష్ట్రపతి విషయాలు అని అధికార విభజన జరిగింది. కేంద్ర శాసనసభ రాష్ట్ర ప్రభుత్వ విషయాలు మినహాయించి అన్ని అంశాలపై చట్టాలను చేసే అధికారం కలిగి ఉంది.

4.6. మరింత ప్రాతినిధ్యం కోసం, పరిపాలనలో భాగస్వామ్యం కోసం, ఆయా సామాజిక వర్గాలవారీగా ప్రాతినిధ్యం కోసం ఉద్యమాలు సాగాయి. వాటిని పరిష్కరించి, వారి డిమాండ్లను స్వీకరించడానికి 1927లో సైమన్ కమిషన్‌ను నియమించడం జరిగింది. సర్‌జాన్ సైమన్ దాని అధ్యక్షుడు. సైమన్ కమిషన్‌లో బ్రిటీష్‌వారే సభ్యులుగా ఉండేవారు. కమిషన్‌లో భారతీయ ప్రతినిధులు లేకపోవడం, సామాజిక వర్గాలవారీగా సిక్కు, ముస్లిం, డిప్రెస్డ్ క్లాసెస్, హిందూ తదితర సామాజిక వర్గాలవారీగా ప్రాతినిధ్యం ఇవ్వడానికి ముందుకు రావడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదు. ఇది మనసులో ఉంచుకొని భారతీయులకు కమిషన్‌లో ప్రాతినిధ్యం లేదనే కారణం చూపి సైమన్ కమిషన్ గో బ్యాక్ అంటూ బహిష్కరించారు. సైమన్ కమిషన్‌కు నివేదిక అందించాల్సిందే, దీన్ని బహిష్కరిస్తే తీవ్రంగా నష్టపోతామని గమనించిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ తదితరులు సైమన్ కమిషన్‌కు విస్తారమైన నివేదికను అణగారిన కులాల దైన్యస్థితిని విశ్లేషించి, నివేదికను సమర్పించారు. సైమన్ కమిషన్ 1930లో బ్రిటిష్ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆ నివేదిక పై లండన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. రౌండ్‌టేబుల్ సమావేశంలో బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధులు, బ్రిటీష్ ఇండియా ప్రతినిధులు, భారతరాజ్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైమన్ కమిషన్ నివేదిక ప్రాతిపధికపైనే దళితులకు ప్రజాప్రాతినిధ్యం కల్పిస్తూ 1932లో కమ్యూనల్ అవార్డ్ ప్రకటించడం జరిగింది. విడిగా దళితులు మాత్రమే అదనంగా దళిత ప్రతినిధులను ఎన్నుకునే విధంగా అందరి ప్రతినిధి, దళితుల ప్రతినిధి అనే రెండు ఓట్లను ఉపాధ్యాయులు ఎమ్మెల్సీని ఎన్నుకోవడం వంటిది కల్పించారు. అలా దళితులకు ప్రత్యేక ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ గాంధీ ఆమరణ నిరాహార దీక్ష చేయడంతో 1932 అక్టోబర్‌లో పూనా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం దళితులకు ప్రాతినిధ్యం కొంత పెంచినప్పటికి రెండు ఓట్లను తొలగించి అందరి ఓట్లతో ఎన్నికయ్యే విధానాన్ని ప్రతిపాదించారు. దాంతో హిందువులు తమ చెప్పుచేతల్లో ఉండే ఆశ్రిత నాయకత్వాన్ని దళితుల్లో తయారు చేస్తారని నిజంగా చిత్తశుద్ధితో దళితులకోసం పనిచేసే నాయకత్వాన్ని ఎదగకుండా చేస్తారని, విధిలేని స్థితిలో ఒప్పందంపై సంతకాలు చేయాల్సి వచ్చిందని అంబేద్కర్ ఆవేదన ప్రకటించారు. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాల ద్వారా భారతీయులకు ఎక్కువ అధికారాలు లభించాయి.

భారత ప్రభుత్వ చట్టం 1935

4.7. 1919 నాటి చట్టంకన్నా మరిన్ని అధికారాలు కల్పిస్తూ బ్రిటిషు ప్రభుత్వం 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని రూపొందించింది. దీనికి తోడు కొన్ని ఇతర కారణాలు కూడా 1935 చట్టానికి దోహదం చేశాయి. స్వరాజ్య వాదుల ఉద్యమాలు సైమన్ కమీషన్ నివేదిక పరిణామాలు, నెహ్రూ నివేదిక, జిల్లా నివేదిక, గాంధీ ఆధ్వర్యంలో జరిగిన శాసనోల్లంగన ఉద్యమం, రౌండ్ టేబుల్ సమావేశాలు వంటివి ఈ చట్టం చేయడానికి దారి తీసిన కొన్ని ముఖ్యమైన అంశాలు. 1933లో బ్రిటిషు ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రం 1935 భారత ప్రభుత్వ చట్టానికి మూలాధారం. అప్పటి బ్రిటిషు ప్రధానమంత్రి రామ్‌సేమ్‌కోడొనాల్డ్ అంబేద్కర్ నివేదికను సానుకూలంగా స్వీకరిస్తూ 1932 ఆగష్టు 4న జారీ చేసిన కమ్యూనల్ అవార్డును ప్రకటించారు. కమ్యూనల్ అవార్డు పరిణామాలతో నూతన చట్టం రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. దళితులకు, ముస్లింలకు, ముస్లీమేతరులకు ప్రత్యేక నియోజక వర్గాలను కేటాయించడంతో ఈ చట్టం ఉభయ వర్గాల మధ్య ఉన్న మత వైషమ్యాలను పెంచిందని కొందరి అభిప్రాయం. కానీ కమ్యూనల్ అవార్డు ద్వారానే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కొనసాగుతూ వస్తున్నాయి.

1935 భారత ప్రభుత్వ చట్టం ప్రధాన అంశాలు

4.8. 1935 భారత ప్రభుత్వ చట్టం బ్రిటీషు పార్లమెంట్ ఆమోద ముద్ర పొంది 1935 ఆగష్టు 2న చట్టంగా రూపొందింది. ఈ చట్టం చాలా విస్తృతమైంది. ఈ చట్టంలో 321 ఆర్టికళ్ళు, 10 షెడ్యూళ్లు ఉన్నాయి. బ్రిటీషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ చట్టాలన్నింటిలోను 1935 చట్టం అత్యంత కీలకమైంది.

1. 1935 భారత ప్రభుత్వ చట్టం వివరణాత్మకమైన, విస్తృత శాసనం. ఇందులో 321 ఆర్టికళ్ళు ఉన్నాయి.

2. బ్రిటిషు పాలిత ప్రాంతాలలోనూ, సంస్థలలోనూ, అఖిల భారత సమాఖ్య అనే ఒక నూతన వ్యవస్థను ఈ చట్టం ప్రవేశపెట్టింది.

3. పరిపాలనా అంశాలను 3 జాబితాలుగా విభజించడమైంది.

ఎ) 59 పాలనా అంశాలతో కూడిన కేంద్ర జాబితా.

బి) 54 పాలనా అంశాలతో కూడిన ప్రాంతీయ జాబితా.

సి) 36 పాలనా అంశాలతో కూడిన ఉమ్మడి జాబితా

భారత రాజ్యాంగ చరిత్రలో 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం ఒక స్పష్టమైన ముందడుగు.

భారత స్వాతంత్ర్య చట్టం 1947

4.9. భారత స్వాతంత్ర్య చట్టం 1947ను 'లార్డ్‌మౌంట్‌బాటన్ ప్రణాళిక' అని కూడా అంటారు. మౌంట్ బాటన్ ప్రణాళిక భారతదేశ విభజనకు ఆధారం అని చెప్పవచ్చు. ఈ ప్రణాళిక ప్రకారం బ్రిటిషు పార్లమెంట్ భారత స్వాతంత్ర చట్టాన్ని 1947 జులై 5న ఆమోదిందించింది. ఇది 1947 జులై 18న బ్రిటీషు రాజరికం ఆమోదాన్ని పొందింది. ఈ చట్టం 1947 ఆగష్టు 15 నుంచి అమలులోకి వచ్చింది. భారత స్వాతంత్ర్య చట్టాన్ని పురస్కరించుకొని, ఇండియా, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు అవతరించాయి. దీనిలో ప్రధాన అంశాలు:

1. భారతదేశం విభజించబడి, ఇండియా, పాకిస్థాన్ అనే రెండు దేశాలు ఏర్పడ్డాయి. ఇవి స్వతంత్రమైన ఆధునిక ప్రభుత్వాలుగా ఆగష్టు 15, 1947 నుంచి అమలులోకి వస్తాయి.

2. ఈ చట్టంవల్ల ఇండియా, పాకిస్థాన్, రాజ్యాంగ పరిషత్‌లు ఆయా దేశాలకు శాసన సభలుగా వ్యవహరిస్తాయి. దీనితో బ్రిటీషు పార్లమెంట్ శాసనాధికారం అంతమైంది.

3. స్వదేశీ సంస్థానాలపై బ్రిటీషు సామ్రాజ్యాధికారం అంతమైంది.

4. భారత స్వాతంత్ర చట్టం అమలులోకి రావడంతో 152 సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగిన బ్రిటీషు పాలన అంతమైంది.

4.10. 'లార్డ్ మౌంట్ బాటన్ ప్రణాళిక' ఆధారంగా బ్రిటీషు పార్లమెంట్ 18 జులై 1947 నాడు భారతదేశ స్వాతంత్ర్య చట్టాన్ని ఆమోదించింది. తత్ఫలితంగా భారతదేశం ఆగష్టు 15, 1947 నాడు స్వతంత్ర దేశం అయింది.

4.11. ఇలా 150 ఏళ్ళ చారిత్రక పరిణామాలు, పరిస్థితులు, ప్రజల అవసరాలు, నోరుగలవాళ్ళు, ఉద్యమాలు ఫలితంగా పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టబడి క్రమంగా పరిపాలనా చట్టాలు రాజ్యాంగ ముసాయిదాకు ప్రాతిపదికగా ఉపకరించాయి.

4.12. మన రాజ్యాంగంలోని అనేక నిబంధనలు ప్రపంచంలోని వివిధ రాజ్యాంగాల నుండి సేకరించి దేశీయ స్థల, కాల పరిస్థితులకు అనుకూలంగా మార్చడం జరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ శాసన సభ సందర్భంలో ఇలా అభిప్రాయపడ్డాడు.

4.13. "ప్రపంచ చరిత్రలో ఈ సమయంలో రూపొందించబడిన రాజ్యాంగంలో క్రొత్త అంశం ఏదైనా ఉందా అని అడగవచ్చు. మొదటి వ్రాత రాజ్యాంగం రూపొందించి నేటికి ఒక వందకంటే ఎక్కువ సంవత్సరాలు గడిచాయి. ఈ సంప్రదాయాన్ని అనేక రాజ్యాలు పాటించి తమ తమ రాజ్యాంగాలను వ్రాతలోకి తెచ్చాయి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే అనేక రాజ్యాంగాలలో ప్రధాన నిబంధనలు ఒకే విధంగా వున్నాయి. చేసిన క్రొత్త విషయమేమిటంటే మనం రూపొందించిన రాజ్యాంగంలో వివిధ రాజ్యాంగాలలోని లోపాలను సవరించి అవి మన దేశ అవసరాలకు అనుగుణంగా మార్చుకోగలిగాం."

**(తరువాయిభాగం రేపటి సంచికలో..)**

## లాక్ డౌన్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి:మంత్రి చామకూర మల్లారెడ్డి



మేడిపల్లి, మే13 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ నిబంధనలను ప్రజలు కచ్చితంగా పాటించాలని కార్మిక శాఖ మంత్రివర్యులు చామకూర మల్లారెడ్డి సూచించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో కరోనా రెండవ దశ నియంత్రణలో భాగంగా మంత్రి మల్లారెడ్డి అధ్యక్షతన ఘట్కేసర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని మున్సిపాలిటీలో కరోనా నియంత్రణ, ఐసొలేషన్ సెంటర్ల ఏర్పాటు, నిర్వహణ మరియు ఇంటింటి సర్వే యొక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరోనా మహమ్మారి నియంత్రణకు ప్రభుత్వం లాక్ డౌన్ విధించడమే కాకుండా ఇంటింటికి సర్వే నిర్వహిస్తూ, కరోనా పాజిటివ్ వచ్చి హోమ్ ఐసొలేషన్ లో ఉండేవారికి అవసరమైన మందులు ప్రభుత్వం అందిస్తుంది కాబట్టి ఇంటింటి సర్వే ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ లాక్ డౌన్ నిబంధనలు కచ్చితంగా పాటించి, విధిగా మాస్కులు ధరిస్తూ, భౌతిక దూరం పాటించాలని తెలిపారు.

## అండర్ గ్రౌండ్ కార్మికులకు లాక్ డౌన్ జీతభత్యాలు ఇవ్వాలి:మిర్యాల రాజి రెడ్డి




బెల్లంపల్లి మే 13 ప్రజా పాలన ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం కరోనా రెండవ విడత విజృంభిస్తున్న దృష్ట్యా ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ సందర్భంగా భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులకు లాక్ డౌన్ వేతనాలు లెదా లే ఆఫ్ గాని ఇవ్వాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కార్యదర్శి మిర్యాల రాజి రెడ్డి సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. గురువారం నాడు ఆయన మాట్లాడుతూ కరోనా సందర్భంగా తీసుకుంటున్న చర్యలను సమర్థిస్తూ అభినందిస్తూ స్వాగతిస్తూనే మరిన్ని కార్మికులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని అందులో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి టెస్టులు చేయించి వ్యాక్సిన్ ఇప్పించే ఏర్పాట్లు చేయాలని అవుట్సోర్సింగ్ మరియు సింగరేణి ఇ పర్మినెంట్ కార్మికులు అనే తేడా లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, అలాగే విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి సానిటైజర్స్, మాస్కులను హైపోక్లోరైడ్ ద్రావణాలను సమకూర్చాలని ఆయన కోరారు.

## లాక్ డౌన్ ను ఆసరా చేసుకుని స్వేచ్ఛగా అక్రమ నిర్మాణాలు



బెల్లంపల్లి మే 13 ప్రజా పాలన ప్రతినిధి:బెల్లం పెల్లి మున్సిపాలిటీ లో అధికార పార్టీ నాయకులు లాక్డౌన్ ఆసరాగా చేసుకుని యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని వాటిని వెంటనే నిలుపుదల చేస్తూ తక్షణమే చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఐకాస నాయకులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం నాడు ఐకాస నాయకులు మాట్లాడుతూ లాక్ డౌన్ ఉపయోగించుకొని యదేచ్ఛగా కాంట్రాక్టర్ బస్తీ పోచమ్మ గుడి వద్ద అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని నిర్మాణాలను ఆపి కబ్జాదారుల పై తగిన చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి అఖిలపక్ష నాయకులు ఒక ప్రకటనలో కోరారు. మునిసి పాలిటి బజారు ఏరియాలోని వ్యాపారానికి అనువైన చోట శిశు మందిర్ రోడ్డులో 17, 18, 31, వ వార్డుల్లో భూకబ్జాలకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కాంట్రాక్టర్ బస్తి పోచమ్మ గుడి కి సంబంధించిన కోట్లాది రూపాయల విలువైన భూమిని అనుమతి లేకుండా మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, గతంలో ఈ పోచమ్మ గుడి వద్ద నిర్మాణాలు చేపడుతున్నారని చేసిన ఫిర్యాదు మేరకు నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారని పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ యధావిధిగా కొనసాగిస్తున్నారని వారన్నారు. లాక్ డౌన్ సమయం లో నిర్మిస్తున్న ఈ అక్రమ కట్టడాలను నిలిపివేయాలని వెంటనే సంబంధిత భూ కబ్జాదారులు పై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని కాపాడాలని బెల్లంపల్లి అఖిలపక్షం తెలిపింది. ఈ కార్యక్రమంలో లో సిపిఐ పార్టీ నాయకులు గుండా చంద్ర మాణిక్యం కాంగ్రెస్ పార్టీ నాయకులు గేళ్ళి జయరామ్ యాదవ్, బత్తుల మధు, కాశీ సతీష్, అమానుల్లాఖాన్, శంకర్, మహమ్మద్ గౌస్, ఆడెపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పురస్కరించుకొని నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకుల పంపిణీ



బెల్లంపల్లి మే 13 ప్రజా పాలన ప్రతినిధి:రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి పట్టణంలో 20 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. గురువారం నాడు పట్టణంలోని ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్ మొహమ్మద్, చక్రపాణి, తాజ్ తెలంగాణ బేకరీ నిర్వాహకులు ఉస్మాన్ పాషా, గౌస్ లు మాట్లాడుతూ రంజాన్ పండుగ పర్వదినం సందర్భంగా నిరుపేద 20 మంది కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశామని స్వీడన్ దేశం లో ఉన్న తన శిష్యుడు రేగుల అనిల్ కుమార్ ఆర్థిక సహాయం చేయడంతో ఈ నిత్యావసర సరుకులు నిరుపేద ముస్లింలకు పంపిణి చేశామనివారు తెలిపారు. ఆర్థిక సహాయం చేసిన తన శిష్యుడు రేగుల అనిల్ కుమార్ కువారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బెల్లంపల్లి 1వ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ముస్కే రాజు తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ ప్రార్థనలు ఇంట్లోనే జరుపుకోవాలని,ముస్లిం సోదరులకు విజ్ఞప్తి

బాలపూర్:(ప్రతినిధి) ప్రజాపాలన : కాలనీవాసులు బాగుండాలని బీసీ సెల్ టిఆర్ఎస్ అధ్యక్షులు దిండు భూపేష్ గౌడ్ స్వయంగా శానిటైజర్ తో పిచికారి చేశారు. బాలపూర్ మండలం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎమ్. ఎల్. ఆర్ కాలనీ లో ఉన్న ముస్లిం సోదరులు పవిత్రమైనటువంటి రంజాన్ పండుగ ప్రార్థనలు ఇంట్లోనే జరుపుకోవాలని కోవిడ్ సెకండ్ వేవ్ దృష్టిలో పెట్టుకో గలరని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కాలనీ వాసులు క్షేమంగా సురక్షితంగా ఉండాలని కరోనా మహమ్మారిని తరిమి కొట్టాలంటే ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలన్నారు. కాలనీలో హైడ్రోక్లోరైడ్ ద్రావణాన్ని స్వయంగా స్ప్రే చేస్తున్న కార్పొరేషన్ బీసీ సెల్ దిండు భూపేష్ గౌడ్.

## మండలంలో కొనసాగుతున్న లాక్డౌన్



వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి మండలంలో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు 4 గంటల పాటు సడలింపు ఉండటంతో వ్యాపార వాణిజ్య సముదాయాల వద్ద జనం కిటకిటలాడుతోంది. 10 గంటల తర్వాత పోలీస్ పెట్రోలింగ్ వ్యాపార వాణిజ్య దుకాణాలు మూసివేసి వాహనాలు రాకపోవటంతో నిత్యం వాహనాల రద్దీతో ఉండే నల్లగొండ భువనగిరి ప్రధాన రహదారి నిర్మానుష్యంగా బోసిపోయి దర్శనం ఇచ్చింది. స్థానిక ఎస్ ఐ రాఘవేందర్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బందితో చెక్ పోస్టు వద్ద రోడ్డుపైకి వచ్చే వాహన దారులకు కరోనాపై అవగాహన కల్పించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

# సినిమా స్పాట్

## ‘అఖండ’లో పూర్ణ..ఆ కాసేపే?



మూమాలుగా బాలకృష్ణ సినిమాలలో హీరోయిన్ పాత్రలకు పెద్దగా ప్రాధాన్యత ఉండదనే సంగతి తెలిసిందే. బోయపాటి శ్రీను బాలకృష్ణ కాంబినేషన్ లో సింహా లెజెండ్ సినిమాలు తెరకెక్కగా ఆ సినిమాలలో హీరోయిన్ పాత్రలకు ఎక్కువగా ప్రాధాన్యత లేదు. ఇప్పుడు ఆయన తాజా చిత్రం అఖండలో హీరోయిన్స్ పరిస్థితి ఏమిటి..వారికి గుర్తింపు తెచ్చే పాత్రలేనా.. అనేది ఇప్పుడు డిస్కషన్ పాయింట్ గా మారింది.అఖండ సినిమాలో హీరోయిన్లుగా ప్రగ్యా జైస్వాల్ పూర్ణ నటిస్తున్నారు. కంచె సినిమాతో గుర్తింపును సంపాదించుకున్న ప్రగ్యా జైస్వాల్ కు ఆ సినిమా మినహా నటించిన ఏ సినిమా కూడా పెద్దగా గుర్తింపు తెచ్చిపెట్టలేదు. దాంతో ప్రగ్యా జైస్వాల్ ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. ఆమె ఈ సినిమాలో ఐఏ ఎస్ ఆఫీసర్ గా కనిపించనుంది. అయినా ఆ పాత్ర గ్లామర్ కు లోటు లేకుండా సాగుతుందిట. ఇక మరో హీరోయిన్ గా చేస్తున్న పూర్ణ ...బాలయ్యకు భార్య అని తెలుస్తోంది. ఆమె క్యారక్టర్ సెకండాఫ్ లో వస్తుందిట. అలాగే తక్కువ లెంగ్త్ ఉంటుందని ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే పాత్ర అని చెప్తున్నారు. దాదాపు గెస్ట్ రోల్ లాంటిదంటున్నారు. ఇంతకు ముందెప్పుడూ బాలయ్య సరసన పూర్ణ చేసింది లేదు. ఇదే ఆమెకు బాలయ్యతో తొలి సినిమా. పెద్ద సినిమా కాబట్టి క్యారక్టర్ చిన్నదైనా పూర్ణ ఒప్పుకుందిట. ఇక నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న హ్యాట్రిక్ చిత్రం ‘అఖండ’. ఈ సినిమాలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఇప్పటివరకు బాలయ్యను ఎప్పుడూ చూడని అఘోరా గెటప్ లో చూడబోతున్నాం అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆ ఎదురుచూపులు ఏ స్థాయిలో ఉన్నాయనేది రీసెంట్ గా ఈ సినిమా టైటిల్ ను ప్రకటిస్తూ విడుదల చేసిన చిన్న టీజర్ కు వచ్చిన రెస్పాన్స్ ను బట్టే అర్ధమైంది. ఈ టీజర్ యూట్యూబ్ లో రికార్డులు సృష్టిస్తోంది. కచ్చితంగా సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని అభిమానులు లెక్కలేస్తున్నారు. ‘అఖండ’లో శ్రీకాంత్ విలన్ గా నటిస్తుండగా... ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్ గా పూర్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ద్వారకా క్రియేషన్స్ బ్యానర్పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్నారు.

## ‘కేజీఎఫ్ 2’ కు బన్ని ఫ్యాన్స్ సవాల్

ఏదైనా ఒక విషయం ఉందంటే సోషల్ మీడియాలో రచ్చ ఓ రేంజిలో ఉంటుంది. ఇప్పుడు కేజీఎఫ్ 2 రిలీజ్ గురించి డిస్కషన్ జరుగుతోంది. వాస్తవానికి ఈ సినిమా జూలై 16 న ఫిక్స్ చేసారు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆ తేదీన రిలీజ్ అవటం కష్టం. దాంతో ఆ టీమ్ దసరా కు రిలీజ్ చేద్దామనే నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు లీక్ లు మీడియాలో మొదలయ్యాయి. అక్టోబర్ 13న ఈ సినిమా రిలీజ్ అవుతున్నట్లుగా మీడియాలో హంగామా మొదలైంది. అయితే అదే రోజున అల్లు అర్జున్ పుష్ప రిలీజ్ ఉంది. దాంతో ఇప్పుడు ఈ రెండు సినిమాలు ఒకే రోజున రిలీజ్ అవుతాయా అనే ప్రశ్న మొదలైంది.ఈ క్రమంలో తమ సినిమా థియోటర్ లో ఉండగా కేజీఎఫ్ 2 వైపు ఎవరు వెళ్తారంటూ బన్ని ఫ్యాన్స్ కొందరు సోషల్ మీడియాలో సవాల్ విసురుతున్నారు. అయితే తెలుగు రెండు రాష్ట్రాల్లో అయితే ఖచ్చితంగా అదే పరిస్దితి ఉంది. ప్రక్కన అల్లు అర్జున్ సినిమా ఉంటే దాన్ని వదిలేసి కన్నడ డబ్బింగ్ సినిమాకు ఎవరు ఎగబడతారు. అయితే అదే సమయంలో కేజీఎప్ కు ఉన్న క్రేజ్ కూడా మామూలుగా లేదు. కేవలం టీజర్కే కోట్ల వ్యూస్ సాధించి రికార్డులు బద్ధలు కొట్టిన కేజీఎఫ్.. థియేటర్లలో వసూళ్ల సునామీ కురిపించేందుకు మరీ ఎక్కువ టైం ఏమీ తీసుకోదు. కాబట్టి టైమ్ అనేదే ముఖ్యం.అయితే ఇవన్నీ మనం డిస్కస్ చేస్తున్నాం కానీ కేజీఎఫ్ పుష్ప ఢీకొట్టే ఛాన్స్ లేదంటున్నారు సినీ విశ్లేషకులు. ఆ టైమ్ కు ఖచ్చితంగా కేజీఎఫ్ వెనక్కు తగ్గుతుంది. లేదా ఇప్పుడే నిర్ణయం మార్చుకుంటుంది.ఇప్పుడు జరుగుతున్న ఈ డిస్కషన్ ఖచ్చితంగా కేజీఎఫ్ టీమ్ ని ఆలోచనలో పడేస్తుంది. కేజీఎప్ 2 కనుక కలెక్షన్స్ తగ్గితే ..అది దర్శకుడు ప్రశాంత్ నీల్ కెరీర్ పై ఇంపాక్ట్ పడుతుంది. అలాగే అదే బ్యానర్ నుంచి వచ్చే మిగతా సినిమాల పైనా పడుతుంది. ఏదేమైనా కేజీఎఫ్ రచ్చ చూడాలంటే మరో కొద్ది నెలలు ఆగాలి.

## ఈ ‘స్టార్ విలన్’కు ఇండస్ట్రీలో డిమాండ్ పెరిగిపోయిందా..??



ఇండియన్ స్టార్ యాక్టర్ సోనూసూద్ అంటే ఇదివరకు ఎక్కువగా గుర్తించేవారు కాదేమో.. లేదా విలన్ రోల్స్ మాత్రమే చేస్తాడని అనుకునేవారు. కానీ ఇప్పుడు సోనూసూద్ అంటే తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పరిచయం అవసరం లేదు. ఎక్కువగా విలన్ రోల్స్ పోషించి ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యాడు. బ్లాక్ బస్టర్ అరుంధతి సినిమాలో చేసిన పశుపతి పాత్రతో కోట్లాది ప్రేక్షకులకు సుపరిచితుడు అయ్యాడు. అయితే సినిమాల్లో విలన్ అయినప్పటికీ సోనూసూద్ నిజజీవితంలో మాత్రం నిజంగానే హీరో అనిపించుకున్నాడు. ఓవైపు కరోనా పై యుద్ధం చేస్తూ.. నిత్యం సామాన్యులకు సేవలను అందిస్తూ వైద్యసిబ్బందికి కూడా తానే సాయం చేస్తున్నాడు సోనూసూద్.ఇప్పటివరకు కరోనా టైంలో ఎవరెన్ని సేవలు చేసినా సోనూసూద్ చేసిన సేవలు ఎవరు చేయలేరు. సోనూసూద్ సహాయం పొందినవారి వారి దృష్టిలో ఇప్పుడు దేవుడు అయిపోయాడు. దేశ ప్రజల దృష్టిలో నిజమైన హీరోగా గతేడాది కాలంగా తనకు చేతనైంది సాయం చేస్తూ ప్రతి ఒక్కరికి కాదనకుండా సేవలు అందిస్తూనే ఉన్నాడు. ఈ విషయంలో దేశం మొత్తం సోనూసూద్ ను కొనియాడుతూనే ఉంది. కానీ ఇప్పటికి సోను సేవలు చేయడంలో ఎలాంటి ఆలోచన లేకుండా ముందుంటున్నాడు. సోషల్ మీడియా ద్వారా సహాయం కోరిన వారికీ రెస్పాండ్ అవుతున్నాడు.అయితే సేవలు చేస్తూ ప్రజల మనసు గెలుచుకున్న సోనూసూద్ క్రేజ్ రోజురోజుకి మరింత పెరిగిపోతుంది. ప్రస్తుతం సోనూసూద్ రెమ్యూనరేషన్ కూడా ఓ రేంజిలో పెరిగిందని టాక్. ఇప్పుడు సోనుతో సినిమా చేయాలంటే కోట్లలోనే పారితోషికం ఎక్సపెక్ట్ చేస్తున్నాడట. అయితే ఇప్పటికి విలన్ రోల్స్ మాత్రమే చేస్తానని అంటున్న సోనుకు తెలుగులో సినిమా చేయాలంటే నిర్మాతలు కోట్లు చెల్లించుకోవాల్సిందే అంటున్నాయి సినీవర్గాలు. అయితే హీరో క్యారెక్టర్స్ ఆఫర్స్ వస్తున్నప్పటికి సోనూసూద్ విలన్ పాత్రలకే ఓకే చెబుతుండటం గమనార్హం. ఇటీవలే అల్లుడు అదుర్స్ అనే సినిమాలో కనిపించిన సోను.. ఆ మధ్యలో తన బయోపిక్ లో తానే నటిస్తానని చెప్పాడు. మరి అదికూడా లైన్ లో పెడుతున్నాడేమో అని టాక్ నడుస్తుంది. ప్రస్తుతం సోను క్రేజ్ మాత్రం ఓ రేంజిలో ఉందనేది తెలిసిందే. సినిమాలపరంగా ఆ క్రేజ్ ఎలా వర్కౌట్ అవుతుందో చూడాలి.

## “ఫ్యామిలీ మ్యాన్ 2” కి కొన్ని రిలీజ్ డేట్లు ఇవే.!




ప్రస్తుతం మన ఇండియన్ డిజిటల్ రంగంలో అంతా ఎంతో ఆస్కతిగా ఎదురు చూస్తున్న మోస్ట్ అవైటెడ్ వెబ్ సిరీస్ “ది ఫ్యామిలీ మ్యాన్ 2”. ఎప్పటి నుంచో భారీ అంచనాలు సెట్ చేసుకున్న ఈ థ్రిల్లర్ వెబ్ సిరీస్ ఎప్పుడో అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కావాల్సి ఉంది. కానీ పలు కారణాల చేత మేకర్స్ ఈ సిరీస్ విడుదల వాయిదా వేశారు.మరి అలా గత కొన్ని రోజులు కితమే ఈ సిరీస్ కు జూన్ లో ముహూర్తం కుదిరింది అని టాక్ బయటకు వచ్చింది. మరి ఇప్పుడు అదే టాక్ నిజం చేస్తూ కొన్ని డేట్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఆల్ మోస్ట్ కన్ఫర్మ్ గా జూన్ 4 అని తెలుస్తుండగా 11వ తేదీ వైరల్ అవుతుండగా వీటితో పాటుగా జూన్ 14 కూడా వినిపిస్తుంది.మరి ఈ మూడింటిలో ఏది ఖరారు అవుతుందో చూడాలి. మరి ఈ సిరీస్ లో మెయిన్ లీడ్ గా వెర్సిటైల్ నటుడు మనోజ్ భాజ్ పై నటిస్తుండగా ఈసారి మెయిన్ వినాలి రోల్ లో స్టార్ హీరోయిన్ సమంతా అక్కినేని నటించింది. అలాగే ఈ మోస్ట్ అవైటెడ్ వెబ్ సిరీస్ ను రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు.

## ఎన్టీఆర్30 కోసం మూడవ సారి..!



ఎన్టీఆర్ 30వ సినిమా షూటింగ్ అతి త్వరలోనే ప్రారంభం కాబోతున్న విషయం తెలిసిందే. ఆర్ ఆర్ ఆర్ సినిమా షూటింగ్ పూర్తి అయిన వెంటనే ఎన్టీఆర్ తో కొరటాల శివ దర్శకత్వంలో సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ సినిమా షూటింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా విషయమై రోజుకు ఒక వార్త సోషల్ మీడియాలో హడావుడి చేస్తూ ఉంది. ఈ సినిమా గురించిన మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ సినీ వర్గాల ద్వారా వినిపిస్తోంది. ఎన్టీఆర్ కు జోడిగా ఈ సినిమాలో కీయరా అద్వానీ ని ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. గతంలో కొరటాల దర్శకత్వంలో రూపొందిన భరత్ అనే నేను సినిమాలో మహేష్ బాబు కు జోడిగా కూడా కొరటాల శివ నటించిన విషయం తెలిసిందే. మళ్ళీ ఇప్పుడు ఆమెను ఈ సినిమా కోసం కొరటాల తీసుకు రాబోతున్నాడు. ఇప్పటికే రెండు సార్లు తెలుగులో నటించిన కీయరా మూడవ సారి టాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఎన్టీఆర్.. కొరటాల శివ ల కాంబోలో గతంలో వచ్చిన జనతా గ్యారేజ్ సినిమాలో హీరోయిన్ గా సమంత నటించిన విషయం తెలిసిందే. మరో కీలక పాత్రలో నిత్యా మీనన్ నటించింది. మరోసారి ఎన్టీఆర్ 30 సినిమాలో కూడా కొరటాల ఇద్దరు హీరోయిన్ లను నటింప జేస్తున్నాడని సమాచారం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

## సూర్యబ్రదర్స్.. రియల్ హీరోస్

వెండి తెరపై హీరోలుగా వెలిగేవారంతా నిజ జీవితంలో హీరోలు కాదు. సినిమాల్లో పేదల కోసం పాటుపడే నాయకులుగా కనిపించేవారు.. బయట కనీసం వారి జాడ కూడా కనిపించదు. సినిమాల్లో ఆస్తులు మొత్తం రాసిచ్చే చాలా మంది.. రియల్ లైఫ్ లో చిల్లిగవ్వ కూడా దానం చేయరు. ఇలాంటి వారు అన్ని ఇండస్ట్రీల్లోనూ ఉన్నారు. కానీ.. మరికొందరు ఉంటారు. రీల్ లైఫ్ లోనే కాదు.. రియల్ లైఫ్ లోనూ నిఖార్సైన హీరోలమని చాటుకుంటారు. అభాగ్యులకు అండగా తమవంతు సహకారం అందిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు సూర్యబ్రదర్స్.అగరం ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఇప్పటికే ఎంతో మంది అభాగ్యులను చదవిస్తున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా.. ఎన్నో సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. ఇక తొలిదశ కరోనా వేళ కూడా ముందుకొచ్చి ఎంతో మందికి సేవలు అందించారు. భారీగా విరాళాలు కూడా సమర్పించారు. తాజాగా.. కొత్త ముఖ్యమంత్రిని కలిసి ఏకంగా కోటిరూపాయలను అందించారు. కొవిడ్ బాధితులను ఆదుకోవాలంటు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఈ మొత్తాన్ని అందజేశారు.తమిళనాడు ముఖ్యమంత్రిగా డీఎంకే అధినేత స్టాలిన్ ఈ మధ్యనే ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఘన విజయం సాధించింది. దీంతో.. అందరూ నూతన ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు చెబుతున్నారు. ఓ పుష్పగుచ్ఛం ఓ శాలువా తీసుకెళ్లి ఫొటోలు దిగి ప్రచారం చేసుకుంటున్నారు. కానీ.. సూర్యబ్రదర్స్ కుటుంబంతో సహా వెళ్లి కొవిడ్ బాధితులను ఆదుకోవాలంటూ రూ.కోటి అందజేయడం గమనార్హం.దీంతో.. సూర్య కుటుంబంపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు నెటిజన్లు. చాలా మంది రీల్ హీరోలేనని సూర్యబ్రదర్స్ నిజమైన హీరోలు అని కామెంట్ చేస్తున్నారు. వారి బాటలో మరికొంత మంది నడిచి నిజమైన హీరోలుగా నిరూపించుకోవాలని సూచిస్తున్నారు.



## చెల్లెమ్మకు కోవిడ్ సోకగానే సల్మాన్ లో కంగారు!



పెళ్లి అంటేనే విముఖత చూపించే సల్మాన్ ఖాన్ కి ఫ్యామిలీ సెంటిమెంట్స్ తక్కువేమీ కాదు. తన సోదరులు అన్నా.. సోదరి అర్పితా ఖాన్ అన్నా అతడికి అమితమైన ఇష్టం. ముఖ్యంగా తన తండ్రికి దత్త పుత్రికే అయినా కానీ సోదరి అర్పిత అంటే సల్మాన్ కి ప్రాణం. అందుకే అతడు అర్పిత మెచ్చిన సఖుడు ఆయుష్ శర్మను ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించాడు. హైదరాబాద్ ఫలక్ నుమా ప్యాలెస్ లో అర్పిత–ఆయుష్ జంట వివాహం బాలీవుడ్ టాలీవుడ్ సెలబ్రిటీలు.. సినీరాజకీయ ప్రముఖుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జంటకు ప్రస్తుతం ఒక పండంటి బిడ్డ కూడా ఉన్నారు.తన కుటుంబ సభ్యుల్లో కొందరు కోవిడ్ –19 వైరస్ బారిన పడ్డారని అర్పితకు కోవిడ్ సోకిందని ఇటీవల సల్మాన్ ఖాన్ వెల్లడించారు. తన తదుపరి చిత్రం రాధే ప్రచార సమావేశంలో సల్మాన్ తన సోదరీమణులు అర్పితా ఖాన్ శర్మ –అల్విరా అగ్నిహోత్రి ఈ వ్యాధి బారిన పడ్డారని చెప్పారు. వారికి ఎలాంటి లక్షణాలు లేవని వెల్లడించారు. మహమ్మారి రెండవ వేవ్ మరింత ప్రమాదకరమని ఆయన అన్నారు.ఇంతకు ముందు ఎవరికో వైరస్ వచ్చిందని విన్నాం. కానీ ఈసారి మా కుటుంబంలో కోవిడ్ కేసులు వచ్చాయి. చివరికి మా ఇంటి డ్రైవర్లకు కరోనా సోకింది. కానీ ఈసారి అది చాలా మందికి సోకుతోంది! అని భాయ్ తెలిపారు.గత నెలలో ముంబైలో 5000 మంది ఫ్రంట్ లైన్ కార్మికులకు సల్మాన్ ఆహారం ఏర్పాటు చేశారు. అతడు ఆహార పంపిణీని పర్యవేక్షిస్తున్న వీడియో తన ఆమోద ముద్రను ఇచ్చే ముందు ఆహారాన్ని రుచి చూసే వీడియో ఆన్ లైన్ లో కనిపించింది. మహమ్మారి సమయంలో సహాయం కోసం ముందుకు రావడం గురించి సల్మాన్ మాట్లాడుతూ ప్రతిరోజూ వందలాది మంది సహాయం కోసం పిలుస్తున్నారు అనేది నిజం. ప్రజలకు సహాయం చేయడానికి మేం మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. మేం 25000 నుండి 50000 సినీకార్మికులకు ఆహారం – మందులను అందిస్తున్నాం అని తెలిపారు.సల్మాన్ నటించినరాధే: యువర్ మోస్ట్ వాంటెడ్ భాయ్ మే 13న విడుదలవుతోంది. ప్రస్తుతం ఆయన రిలీజ్ ప్రమోషన్లలో బిజీగా ఉన్నాడు. ఈద్ కానుకగా ఈ చిత్రం 40 దేశాలలో విడుదల కానుంది. వీటిలో ప్రధానంగా విదేశీ మార్కెట్లలో థియేట్రికల్ రిలీజ్ సంచలనంగా మారింది.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్

BUSSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?

మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని
చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను
మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part ‘A’), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989